# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 29 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 4 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :29 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 4 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..

### రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్



- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందన్న ఆర్‌బీఐ గవర్నర్
- ఆర్థిక ముప్పులపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్న మల్హోత్రా
- ప్రపంచ దేశాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయని వెల్లడి
- వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు ప్రభావం చూపుతున్నాయని ప్రకటన
- ఆర్థిక సమస్యలు ఒక్కసారిగా బయటపడొచ్చని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

- మిగతా 2లో



### లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను

## తక్షణమే రద్దు చేయాలి

- దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న ఖర్గే
- మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో

- మిగతా 2లో



## ఆ నీచులను వదిలిపెట్టను

### ఎన్టీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్

పెన్ పవర్ డెస్క్: సామాజిక మాధ్యమాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికతను ఉపయోగించి అసభ్యకర రీతిలో వీడియోలను క్రియేట్ చేయడంపై అగ్రకథానాయకుడు ఎన్టీఆర్ తీవ్ర ఆగ్రహం

- మిగతా 2లో

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

### సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్



- యూపీలో సీట్ల పంపకాలపై ఎస్పీ, కాంగ్రెస్ మధ్య రాజుకున్న వేడి
- ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారన్న ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్
- సీట్ల పంపకాలపై అక్టోబర్‌లో జరిగే చర్చల్లో అఖిలేశ్‌దే తుది నిర్ణయమని వెల్లడి
- పొత్తు వల్ల కాంగ్రెస్‌కే అధిక ప్రయోజనమని వ్యాఖ్య
- 150 సీట్లు కావాలంటూ ఇప్పటికే తమ మనోగతాన్ని బయటపెట్టిన కాంగ్రెస్

- మిగతా 2లో

## రైతులపై ప్రేమ ప్రచారానికే పరిమితం



పెన్ పవర్ డెస్క్:ఏపీలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు శంకుస్థాపన సందర్భంగా మదనపల్లి సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. హార్టికల్చర్ పై చంద్రబాబు మాటలు డ్రామాలని..బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు జగన్. రైతులపై చంద్రబాబు ప్రేమ

- మిగతా 2లో




## క్వ్యా-శివ, అమరావతి

# డిక్లరేషన్..

### పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు

- విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026
- హాజరైన సీఎం చంద్రబాబు
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు
- అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
- క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి

- మిగతా 2లో

## 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన..

### నేడు తెనాలికి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్

- పేదల కోసం మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్ల ప్రాజెక్టుకు భూమిపూజ
- గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో రేపు ఈ కార్యక్రమం
- గత 28 నెలల్లో ప్రభుత్వం 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (PMAY-G) 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి (అక్టోబరు 4) భూమిపూజ చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరగనుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3 లక్షలు, ఈ ఏడాది మార్చిలో 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఇటీవలే ఈ 3 లక్షల ఇళ్లను కేటాయించింది. దీంతో ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ**

ఈ కార్యక్రమంతో పాటు, గృహ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు, శివరాజ్ సింగ్ చౌహాన్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా

- మిగతా 2లో



## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం
- బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ
- గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో

- మిగతా 2లో



## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

### చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు
- పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ

పెన్ పవర్ డెస్క్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా

- మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు



- బీసీలకు అధికారం దక్కకూడదని వైసీపీ కుట్ర చేసిందన్న రామ్మోహన్ నాయుడు
- రిజర్వేషన్ల కోసం కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందని వెల్లడి
- టీడీపీకి బీసీలు వెన్నెముక వంటివారని వ్యాఖ్య

- మిగతా 2లో

## చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది



### పాన్ ఐఐటీ సమ్మిట్ లో మంత్రి లోకేశ్

- విజయవాడలో 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026
- హాజరైన మంత్రి నారా లోకేశ్
- ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని ఉద్ఘాటన
- చంద్రబాబు అనుభవానికి యువ ఎమ్మెల్యేల బృందం తోడైందని వెల్లడి

- మిగతా 2లో




## ఫ్లైట్‌లో దాడి ముందస్తు పథకమా ?

ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడి జరగడం కలకలం రేపింది. అది కూడా కో పైలట్ ఈ పని చేయడం ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. మచ్చర్‌పై దాడికి యత్నించిన కో-పైలట్ హమామ్ అల్-హమామీకి సంబంధించి పలు కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. పలు నివేదికల ప్రకారం, అతడి పాత సోషల్ మీడియా అకౌంట్లు పరిశీలనలో అల్-ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తుల ఫోటోలు, ఇతర అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన సమాచారం లభించాయి. యూఏఈ అటార్నీ జనరల్ ఈ ఘటనపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఉగ్రదాడి, హైజాక్ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.నివేదికల ప్రకారం, హమామ్ అల్-హమామీ ఒమన్‌కు చెందిన పౌరుడు. అతడు యూఏఈ లో జన్మించాడని కొన్ని నివేదికలు చెబుతుండగా.. అతని తండ్రి ఒమన్ పౌరుడని, తల్లి సిరియాకు చెందిన వ్యక్తి అని తెలిసింది. అతడు కొన్నేళ్లపాటు యూఏఈలో గడిపాడు. అతని పేరుతో ఉన్న లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం, ఒమన్ ఎయిర్‌లో దాదాపు ఏడేళ్లు పనిచేశాడు. ఆ తర్వాత రాయల్ ఎయిర్ మరోక్ తో అనుబంధం కలిగి ఉన్నాడు. ఆ తర్వాత ఫ్లైదుబాయ్‌లో కో-పైలట్‌గా చేరి సేవలు అందిస్తున్నాడు.024లో నిందితుడు, కో పైలట్ హమామ్ అల్ హమామీని ఒమన్ ఎయిర్‌లో ఫ్లైట్ ట్రైనింగ్ నుంచి తప్పించారు. తీవ్రవాద భావజాలం వల్ల ఆకర్షితుడు అవుతున్నాడని అతడిపై అనుమానం వచ్చింది. దాంతో తలెత్తిన భద్రతా పరమైన ఆందోళనలే అతడ్ని తొలగించడానికి కారణమని సమాచారం. అతడిని ఎయిర్‌లైన్ నుంచి పూర్తిగా తొలగించకుండా ఇతర, నాన్-ఫ్లయింగ్ బాధ్యతలు అప్పగించారని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. అయితే, ఆ సమయంలో అతని సమాచారాన్ని ఇతర ఎయిర్‌లైన్లు లేదా సంబంధిత దేశాల సంస్థలతో ఎంతవరకు పంచుకున్నారనే అంశంపై స్పష్టత లేదు. సీఎన్ఎన్ నివేదిక ప్రకారం, హమామ్‌కు సంబంధించిన సోషల్ అకౌంట్లలో కొన్ని అనుమానాస్పద ఫోటోలు, వీడియోలు లభించాయి. అందులో అల్-ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తులు కనిపిస్తున్నారు. ఒక వీడియోలో బోయింగ్ 737 మాక్స్ కాక్‌పిట్ నుంచి వేర్వేరు విమానాల రికార్డింగ్ కనిపిస్తుంది. వీడియో చివరలో అల్-ఖైదా మాజీ చీఫ్ ఐమన్ అల్-జవాహిరీ, 2009లో జxూరా అధికారుల హత్యతో సంబంధం ఉన్న హుమామ్ ఖలీల్ అబూ-ములాల్ అల్-బలావీల ఫోటోలు ఉన్నాయని గుర్తించారు. ఈ పోస్టులపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఆ తర్వాత సోషల్ మీడియా ప్రొఫైళ్లు తొలగించారు.నివేదికల ప్రకారం, మరొక సోషల్ పోస్ట్‌లో ఏఐ సాయంతో తయారు చేసిన ఒక ఫొటో ఉంది. అందులో మక్కా, మదీనా, జెరూసలేంలను ఒక మెరుస్తున్న గీతతో కలిపాడు. దీంతో పాటు మరణం, అవమానానికి సంబంధించిన పదాలతో ఉన్న ఒక కవిత ఉన్నాయి. ఈ పోస్టులకు ప్రమాదంతో నేరుగా సంబంధం ఉందో లేదో దర్యాప్తులో తేలనుంది.సీఎన్ఎన్ నిపుణుల ప్రకారం, హమామ్ పాత, ఇప్పుడు తొలగించిన సోషల్ మీడియా పోస్టులలో మహిళల పట్ల కఠినమైన అభిప్రాయాలు ఉన్నాయి. పెళ్లి తర్వాత భార్య ఉద్యోగం చేయకూడదని, నిఖాబ్ ధరించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాడు. మరికొన్ని పోస్టులలో పురుషులు, మహిళలు కలసి పనిచేసే వర్క్ స్పేస్ లను పూర్తిగా వ్యతిరేకించాడు. సీఎన్ఎన్ 2021, 2022 నాటి దాదాపు 3,000 తొలగించిన పోస్టులను విశ్లేషించారు. ఈ పోస్టుల ద్వారా అతని వ్యక్తిగత, మతపరమైన ఆలోచనలు ఉన్నాయి. అయితే ఒక వ్యక్తి సోషల్ మీడియా ఆలోచనలకు, ఒక నేర సంఘటనకు నేరుగా లింక్ ఉందా లేదా అనే కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోంది. 30 సెప్టెంబర్ 2026న ఫ్లైదుబాయ్ విమానం ఫ్లై1073 దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తుండగా కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య గొడవ జరిగింది. కో పైలట్ హమామ్ అల్ హమామీ దాడిలో భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ గాయపడ్డారు. యూఏఈ అధికారిక సమాచారం ప్రకారం, ఈ ఘటన తర్వాత విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ ఎయిర్ పోర్ట్ వైపు మళ్లించి అక్కడ ల్యాండ్ చేశారు. ప్రయాణికులు, విమానంలో ఉన్న ఇతర క్రూ సభ్యులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. యూఏఈ జనరల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ తరువాత కెప్టెన్ స్మిత్ మచ్చర్ సురక్షితంగా యూఏఈకి తిరిగి రాగా, వైద్య చికిత్స కొనసాగుతోంది.

## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

- మొదటి పేజి తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు.

ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఆ నీచులను వదిలిపెట్టను

- మొదటి పేజి తరువాయి

వ్యక్తం చేశారు. దేవర సినిమాలోని 'చుట్టమల్లే' పాట వీడియోను ఏఐతో మార్ఫింగ్ చేయడంపై ఆయన మండిపడ్డారు. మహిళలను పూజించే దేశంలో వారి గౌరవాన్ని దిగజార్చారంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వారిని వదిలిపెట్టబోనని, బాధ్యులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు."ఇది అత్యంత అసహ్యకరమైన చర్య. మహిళలను తల్లులుగా, దేవతలుగా పూజించే నేల మనది. 'మాతృదేవోభవ' అనే నినాదం మన సంస్కృతిలో భాగమైన చోట.. కొందరు వ్యక్తులు అత్యంత దిగజారి ప్రవర్తిస్తున్నారు. ఒక మహిళను అవమానించేలా ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఇలాంటి నీచమైన కంటెంట్‌ను సృష్టించడం సిగ్గుచేటు. 'చుట్టమల్లే' పాట మార్ఫింగ్ వీడియో వెనుక ఉన్న నీచులు ఎవరినీ వదిలిపెట్టను" అని ఎన్టీఆర్ హెచ్చరించారు.

ఇక ఇలాంటి అసభ్యరమైన కంటెంట్‌ను ఎవరూ చూడొద్దని ఎన్టీఆర్ విజ్ఞప్తి చేశారు. "ఈరోజు వేరొక మహిళకు ఇలాంటి అవమానం జరిగింది. రేపు మీ ఇంట్లో మీ తల్లి, భార్య, కుమార్తెకూ ఇదే పరిస్థితి ఎదురవ్వొచ్చు. ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టడానికి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి కేంద్రంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కఠినమైన నిబంధనలు తీసుకురావాలని కోరుతున్నాను" అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.ఏఐ మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు సెలబ్రిటీల పాలిట నరకంగా మారాయి. ఇటీవల 'అర్జున్ రెడ్డి' హీరోయిన్ శాలిని పాండే కూడా దీని బారిన పడ్డారు. ఆమెపై అసభ్యకర రీతిలో వీడియోలను రూపొందించగా అవి వైరల్ అయ్యాయి. దీనిపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీని ఇలా ఉపయోగించడం సరికాదంటూ మండిపడ్డారు. ఆ వీడియో కనిపిస్తే ఎవరూ షేర్, డౌన్‌లోడ్ చేయొద్దని.. వెంటనే రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రష్మిక, కత్రినా కైఫ్, మృణాల్ ఠాకూర్, కీర్తి సురేశ్‌కు సంబంధించిన డీప్‌ఫేక్ వీడియోలు కూడా వైరలైన సంగతి తెలిసిందే.

## రైతులపై ప్రేమ ప్రచారానికే పరిమితం

- మొదటి పేజి తరువాయి

ప్రచారానికే పరిమితమని.. చంద్రబాబు పాలనలో ధరల స్థిరీకరణ నిధి నిర్వీర్యమైందని అన్నారు జగన్.చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పథకం రద్దు చేశారని అన్నారు. రాయలసీమలో 7-8 లక్షల బోర్లు ఎండిపోయాయని.. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు చంద్రబాబే అడ్డంకి అని అన్నారు జగన్. రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కరువు నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు జగన్. తీవ్రమైన కరువు కారణంగా రాయలసీమలో ఇప్పుడు తీవ్ర దుర్భిక్షం నెలకొంటే, వేలాది ఎకరాల్లో హార్టికల్చర్ తోటలు ఎండిపోతుంటే, మీరు వాటర్ మ్యాన్ అని బిల్డప్ ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇక హార్టికల్చర్ హబ్ సంగతి పక్కనపెడితే, రైతుల ఆత్మహత్యలకు చిరునామాగా రాయలసీమ సహా రాష్ట్రం మొత్తం తయారయ్యిందని... మీ డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టి, రైతులకు ఊరటనిచ్చేలా తక్షణమే కరువు నివారణా చర్యలు మొదలుపెట్టండని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు జగన్.

# క్వా-శివ, అమరావతి డిక్లరేషన్..

- మొదటి పేజి తరువాయి

పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్వా-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు.క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్వా-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

### అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

### క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది

ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అనే బలమైన సాఫ్ట్‌వేర్‌కు, యువతతో నిండిన చురుకైన హార్డ్‌వేర్ టీమ్ ఇప్పుడు అండగా నిలిచిందని, ఈ అరుదైన కలయికతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026'లో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తామని, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీని మార్చడమే తమ ఉమ్మడి లక్ష్యమని అన్నారు.

"ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. మా శాసనసభ్యుల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారే. 25 మంది మంత్రులలో 17 మంది తొలిసారి మంత్రులయ్యారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు, ఈ యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలన్నదే మా స్పష్టమైన విజన్" అని లోకేశ్ వివరించారు. 5 లక్షల మందికి పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలిపే పాన్ ఐఐటీ సదస్సు ఏపీలో జరగడం ఆనందంగా ఉందన్నారు.

### అభివృద్ధికి '3ఎ' మంత్రం

అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్‌కు ఒక దశాబ్దం చాలని, ఆ స్వర్ణ దశాబ్దం మనదే కావాలని ఆకాంక్షించిన లోకేశ్, దీనికి తమ ప్రభుత్వం '3ఎ' మంత్రాన్ని అనుసరిస్తోందని తెలిపారు. "మొదటిది స్పీడ్ (వేగం), రెండోది సర్వీస్ (సేవ), మూడోది స్టెబిలిటీ (స్థిరత్వం). ప్రజలు మాకు ఇచ్చింది ఐదేళ్ల సమయం. ఈ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయూలు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే రకం మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. పరిశ్రమదారులను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. వారితో కలిసి పనిచేస్తూ, ప్రపంచ స్థాయి పాలన అందించడమే మా సేవా దృక్పథం. ఇక మూడోది స్థిరత్వం. మా పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడేలా ఉంటాయి" అని ఆయన అన్నారు. ఇందుకు ఉదాహరణగా, గత కేసులన్నింటినీ AI ద్వారా విశ్లేషించి, న్యాయపరమైన చిక్కులు రాకుండా 16,000 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టామని గుర్తుచేశారు.

### అమలుపైనే దృష్టి.. ఇవే మా నిదర్శనాలు

కేవలం కాగితాలపై హామీలు కాకుండా, వాస్తవంగా అమలవుతున్న ప్రాజెక్టుల గురించి లోకేశ్ సవివరంగా మాట్లాడారు. "ఏపీలో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉండటం వల్లే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం సంకల్పంతో రిలయెన్స్ భాగస్వామ్యంతో మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు శంకుస్థాపన చేశాం. ఇది లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది" అని తెలిపారు.

"ఇతర రాష్ట్రాల్లో దశాబ్దాలుగా నిలిచిపోయిన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కేవలం 17 నెలల్లోనే పునాది వేశాం. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని 13 నెలల్లోనే అనుమతులు సాధించి పనులు ప్రారంభించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్‌కు 300 ఎకరాలు కేటాయించాం. మారిటైమ్ డ్రోన్లు తయారుచేసే సాగర్ డిఫెన్స్ సంస్థకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలం ఇవ్వగా, 18 నెలల్లో ఆ సంస్థ విలువ రూ.3,000 కోట్ల నుంచి రూ.23,000 కోట్లకు పెరిగింది. ఇదే మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని లోకేశ్ పేర్కొన్నారు.

### 23 క్లస్టర్ల ఏర్పాటు.. అమరావతిపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో హార్టికల్చర్ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు 23 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, రెన్యువబుల్ ఎనర్జీలో ఏడాదిలోనే 4.8 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించామని లోకేశ్ వెల్లడించారు. అమరావతి నిర్మాణంపై మాట్లాడుతూ, "మీరు అమరావతికి వస్తే, నిర్మాణంలో ఉన్న ఒక ఆధునిక నగరం కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ నార్మన్ ఫాస్టర్ డిజైన్లతో అసెంబ్లీ, సచివాలయం వంటివి నిర్మిస్తున్నాం. ఇక్కడ 5,000 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించబోతున్నాం. హైదరాబాద్ అభివృద్ధిలో శంషాబాద్ విమానాశ్రయం పోషించిన పాత్రను ఇది పోషిస్తుంది" అని అన్నారు.

### ఐఐటీయన్లకు రెండు విజ్ఞప్తులు

ఈ సందర్భంగా పాన్ ఐఐటీ కమ్యూనిటీకి లోకేశ్ రెండు విజ్ఞప్తులు చేశారు. "మొదటిది, ప్రపంచాన్ని జయించిన మీ గ్రాడ్యుయేట్ల పరిజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని మా 23 క్లస్టర్ల అభివృద్ధికి

అందించాలి. రెండోది, 'జుగాడ్' మోడల్ నుంచి 'వ్యవస్థీకృత వేగం' వైపు ఏపీ ప్రయాణించడానికి, ఏఐ సాయంతో మెరుగైన పాలన అందించడానికి మీరంతా సహకరించాలి. ఇతర దేశాల మోడళ్ల గురించి మాట్లాడటం కాదు, భారత్ ఏం చేయగలదో ప్రపంచానికి చూపించాలి. అందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆదర్శంగా నిలపాలనుకుంటున్నాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు.అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

- మొదటి పేజి తరువాయి

వెల్లడికాలేదు.షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు.హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు.ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతోనే గతంలో వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై గతంలో కోర్టు తీర్పు ఇస్తే, దానిపై అప్పటి జగన్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందే తెలుగుదేశం పార్టీ అని గుర్తుచేశారు. బీసీలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, తమది బీసీల పార్టీ అని అన్నారు. జగన్ అండ్ కో ఆటలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

## 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన..

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి.పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో 177 ఇళ్లను నిర్మించనున్నారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా అత్యంత వేగంగా, తక్కువ శ్రమతో నిర్మాణం పూర్తి చేయడం, నిర్మాణ వ్యర్థాలను తగ్గించడం, నాణ్యత, పటిష్ఠతను పెంచడం సాధ్యమవుతుందని అధికారులు వివరిస్తున్నారు.

### ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం 10:15 గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 10:35 గంటలకు బుర్రిపాలెం చేరుకుంటారు. ఉదయం 10:40 గంటలకు 3డీ ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు భూమిపూజ చేసి, అనంతరం లబ్ధిదారులతో సమావేశమవుతారు. 11:10 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 1:35 గంటలకు తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు.కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై

చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు.కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

## అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..

### రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్

- మొదటి పేజి తరువాయి

కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు.

అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

### ఒక్కసారిగా సమస్యలు రావొచ్చు

బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

# మహిళా రైతు బజార్ లో ఉల్లి విక్రయాలు



**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 03** జీవీఎంసీ 66 వార్డులో గాజువాక మహిళా రైతు బజార్ నందు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ ఆదేశాల మేరకు మహిళా రైతు బజార్ నందు కేజీ ఉల్లిపాయ 35 రూపాయలకే వినియోగదారులకు రెండు కేజీలు చొప్పున పంపిణీ చేశారు . బయట మార్కెట్లో ఉల్లి ధర పెరగడంతో రైతు బజార్లో సబ్సిడీ రేట్లకే రెండు కేజీలు 70 రూపాయలకు శాసనసభ్యుడు ఆదేశాల మేరకు ప్రతి ఒక్క వినియోగదారుడికి ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో రైతు బజార్ల జెడి సుధాకర్ , మార్కెటింగ్ డైరెక్టర్ రవికుమార్, విశాఖ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్లు స్వర్ణపుడి రాంబాయి ,జగదీశ్వరి 66వ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, వార్డు అధ్యక్ష కార్యదర్శులు గోమాడ వాసు, ఎండి ముర్తాజ ఎస్టేట్ ఆఫీసర్ వరలక్ష్మి సహాయకులు మనీ ,క్లస్టర్ ఇంచార్జ్ , రమణ తారకేశ్వరరావు ,రత్న కాంత్, గణేష్ రెడ్డి ,అబ్రార్ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గెలిపించాం.. ఓడినా నిలిచాం.. ఇప్పుడు మమ్మల్ని ఆదుకోండి




- తూర్పు నియోజకవర్గ టీడీపీ సీనియర్ల ఆవేదన - అధిష్టానం స్పందించాలని వినతి
- రాబోయే ఎన్నికలలో పార్టీ టికెట్ల కేటాయింపు పై టిడిపి పునర్ ఆలోచన చేయాలి

**విశాఖ తూర్పు, పెన్ పవర్ అక్టోబర్ 3:**తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి కష్టాల్లో పార్టీ జెండాను మోసిన సీనియర్లను కాదని, వలస నేతలకు కార్పొరేటర్ అభ్యర్థుల కేటాయింపు నిర్ణయాలపై అధిష్టానం ఆలోచన చేయాలని, పలు నియోజకవర్గాలలో ఈ చర్యను సీనియర్లు వ్యతిరేకిస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలో అభ్యర్థుల టికెట్ కేటాయింపు ఇంకా ప్రారంభం కానప్పటికీ అధిష్టానంపై అసంతృప్తి సెగలు తీవ్రం కానున్నాయి.

గత ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, మళ్లీ పోటీకి సిద్ధంగా ఉన్నామని సీనియర్లు చెబుతున్నారు. ఎన్నో ఏళ్లుగా బూత్ ఏజెంట్లుగా, వార్డు అధ్యక్షులుగా, కన్వీనర్లుగా పనిచేసి, సొంత డబ్బులు ఖర్చు చేసి పార్టీని బతికించామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ఒక్క తూర్పు నియోజకవర్గంలోనే కాదు, వివిధ నియోజకవర్గాల్లోనూ ఉందని వారు పేర్కొంటున్నారు. పార్టీని వీడి వెళ్లి తిరిగి వచ్చిన వారికి కాకుండా, కష్టకాలంలో అండగా నిలిచిన తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.తాము పార్టీకి వ్యతిరేకం కాదని, అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని, అయితే తమ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత అధిష్టానంపై ఉందని స్పష్టం చేస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును నాలుగు సార్లు గెలిపించిన వారిని అధిష్టానం గుర్తించి, గతంలో ఓడిపోయిన వారికి తిరిగి టికెట్లు ఇచ్చి ఆదుకోవాలని, తద్వారా టికెట్ ఆశించే ప్రతి కార్యకర్తకు పార్టీపై నమ్మకం కలుగుతుందని సీనియర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భవనం కూల్చారు.. బాలల చదువులను గాలికొదిలారు!

- అంగన్వాడి వరండాలో 30 మంది విద్యార్థుల చదువులు
- మంగళపాలెం పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలని ఎస్ఎంసీ డిమాండ్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 3:**శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను కూల్చివేస్తూ విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకుంటున్న అధికారులు.. అదే సమయంలో ప్రత్యామ్నాయ వసతి కల్పించడాన్ని మాత్రం విస్మరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గూడెంకొత్తవీధి మండలం దేవరపల్లి పంచాయతీ మంగళపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇదే పరిస్థితి నెలకొంది.పాఠశాలలో ఉన్న ఏకైక భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు దానిని కూల్చివేశారు. అయితే విద్యార్థుల కోసం ప్రత్యామ్నాయ భవనం ఏర్పాటు చేయకపోవడంతో ప్రస్తుతం సుమారు 30 మంది బాలబాలికలకు అంగన్వాడి కేంద్రం వరండాలోనే విద్యాబోధన నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది.వర్షాలు, ఎండల సమయంలో వరండాలో తరగతులు నిర్వహించడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ఒకవైపు శిథిల భవనం వల్ల ప్రమాదం జరగకుండా కూల్చివేత చేపట్టిన అధికారులు.. మరోవైపు విద్యార్థుల చదువులకు కనీస వసతులు కల్పించకపోవడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాల భవనం కూల్చివేతతో సమస్య పరిష్కారం కాకుండా.. విద్యార్థులకు కొత్త సమస్యను సృష్టించినట్లయింది అని ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ పేర్కొన్నారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్షణమే స్పందించి మంగళపాలెం పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు.విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా తాత్కాలికంగా సురక్షితమైన తరగతి గదులను ఏర్పాటు చేసి, శాశ్వత పరిష్కారంగా కొత్త పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# జీవీఎంసీ ఎన్నికలకు కసరత్తు ముమ్మరం



- పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు పటిష్ట ఏర్పాట్లు
- అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 03 :** గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ రెండో సాధారణ ఎన్నికలను సమర్ధ వంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీ గా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, శిక్షణ, ఎన్నికల సామగ్రి, పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూ మ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ తదితర అంశాలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఎన్నికల ప్రక్రియ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముంద స్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్ట ర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను పరిశీలిం చి లోటుపాట్లను సరిదిద్దాలని ఆదేశించారు. ఎ న్నికల సిబ్బందికి విధులపై సమగ్ర శిక్షణ అందిం చి, తమ బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పిం చాలని పేర్కొన్నారు.ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ, భద్రపరిచే ప్రక్రియలను పకడ్బందీగా నిర్వహించాలని, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కిం పు కేంద్రాల్లో భద్రతతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.ఎన్నికల నిర్వహణలో వివిధ శాఖ ల మధ్య నిరంతర సమన్వయం కొనసాగించా లని తెలిపారు.ఎన్నికల విధుల్లో వినియోగించే సిబ్బందిని విశాఖ గ్రామీణ, అనకాపల్లి గ్రామీణ ప్రాంతాల నుంచి సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ల జాబితాల్లో ఎలాంటి తప్పు లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. స్ట్రాంగ్ రూమ్‌లు, పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసి, ఎన్ని కల కమిషన్ నిబంధనల మేరకు భద్రతా ప్రమా ణాలను పాటించాలని పేర్కొన్నారు.మారిన వార్డులు, కొత్తగా చేరిన వివరాలపై ప్రజ లకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూ చించారు. పోలీస్, మీడియా, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలను సమర్థ వంతంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**120 వార్డులు,1,990 పోలింగ్ కేంద్రాలు**

జీవీఎంసీ పరిధిలో 120 వార్డులు, 1,990 పోలిం గ్ కేంద్రాలు ఉన్నాయని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. మొత్తం 18,37,901 మం ది ఓటర్లు ఉన్నారని, వీరిలో 9,06,866 మంది పురుషులు, 9,30,916 మంది మహిళలు, 119 మంది ఇతర ఓటర్లు ఉన్నారని వివరించారు.

ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించడంతో పాటు 20 శాతం అదనపు సిబ్బందిని రిజర్వు లో ఉంచుతున్నట్లు తెలిపారు. మొత్తం 14,328 మంది పోలింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.వార్డు వారీగా ఓట ర్ల సంఖ్య, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాల ప్రచురణ, ఎన్నికల సిబ్బంది వివరాలు, శిక్షణ కార్యక్రమాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రా లు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏ ర్పాట్లపై కమిషనర్ అధికారులకు వివరించారు.

ఎన్నికల నిర్వహణ కోసం 4,800 బ్యాలెట్ పెట్టె లను సమకూర్చుకునేందుకు ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. జోన్‌ల వారీగా ఎన్ని కల సామగ్రి పంపిణీ కేంద్రాలను గుర్తించి, సామ గ్రి ప్యాకింగ్, పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.ఎన్నికల అనంతరం సా మగ్రి స్వీకరణ, భద్రపరచడం, ఓట్ల లెక్కింపు కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలను గుర్తించినట్లు కమిషనర్ వెల్లడిం చారు. అన్ని స్థాయిల్లో ముందస్తు సన్నద్ధతతో, సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలను సజావు గా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు, డిప్యూటీ కలెక్టర్ గోవిందు, అడిషనల్ కమిషనర్లు రమణమూర్తి, వర్మ, నల్లనయ్య, సత్యవేణి, ఎస్టేట్ ఆఫీసర్ దయానిధి, సీసీపీ ప్రభాకర్, జోనల్ కమిషనర్లు, ఏసీపీలు, ఎన్నికల సెల్ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల భూ హక్కులకు పూర్తి భరోసా



టీడీపీ నేతలు చెండా బాపూజీ, కొచ్చో కామరాజు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 03.**మండలంలో గల మాకవరం పంచాయతీ పరిధిలోని అరబీరు గ్రామంలో 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా 76 పట్టాలు రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసినట్లు టిడిపి నాయకులు చెండా బాపూజీ, కొచ్చో కామరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రీ-సర్వే పూర్తయిన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను విడతల వారీగా పంపిణీ చేస్తోందన్నారు. రైతుల భూ హక్కులకు పూర్తి భరోసా కల్పించడం, భూ వివాదాలు లేకుండా తప్పులు లేని రికార్డులను అందించడం జరుగుతుందన్నారు. కొత్త పాసుపుస్తకాలను ప్రభుత్వ రాజముద్ర మరియు భూ యాజమానుల చిత్రాలతో అత్యంత భద్రతా ప్రమాణాలతో ముద్రించారన్నారు. తమ భూములకు సంబంధించిన అధికారిక పట్టాలు అందడంతో అరబీరు గ్రామస్థులు మరియు రైతులు సంతోష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారిణి విజయలక్ష్మి, గోపాలరావు, రఘునాథ్, పులందర్, లక్ష్మణ్, జగత్రాయి, చందు, ప్రహ్లాద్, కామేష్, సోను, గోపాల్, విశాంత్, మాణిక్యం, క్రిష్ణ, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతలో ద్వారకా బస్‌స్టేషన్‌కు రాష్ట్రస్థాయి అగ్రస్థానం

**పారిశుద్ధ్య కార్మికులు, సూపర్వైజర్లు, అధికారులకు సన్మానం**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 03 :** స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల అమలులో భాగంగా నిర్వహించిన 'స్వచ్ఛ బస్ స్టేషన్' విభాగంలో విశాఖపట్నంలోని ద్వారకా బస్ స్టేషన్ రాష్ట్రస్థా యిలో ప్రథమ స్థానాన్ని సాధించి ప్రతిష్ఠాత్మక అవార్డును దక్కించుకుంది. గాంధీ జయంతి సందర్భంగా శు క్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు అవార్డు ను అందుకున్నారు.ఈ సందర్భంగా శనివారం ద్వారకా బస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో అభినందన, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్ స్టేష న్ పారిశుద్ధ్య కార్మికులు, సూపర్వైజర్లు, అధికా రులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు మాట్లాడుతూ, ద్వారకా బస్ స్టేషన్‌కు రాష్ట్రస్థా యి అవార్డు రావడం వెనుక ప్రతి ఒక్కరి సమష్టి కృషి ఉందన్నారు. ఇది ఏ ఒక్కరి వల్ల సాధ్యమై న విజయం కాదని, పారిశుద్ధ్య కార్మికులు, సూ పర్వైజర్లు, అధికారులు, ఇతర సిబ్బంది సమ న్వయంతో పనిచేయడం వల్లే ఈ ఘనత సాధ్య మైందని తెలిపారు. అవార్డు సాధనలో భాగస్వా ములైన ప్రతి ఒక్కరినీ అభినందించారు.రాష్ట్రస్థాయి అవార్డు దక్కడం సంతోషకరమైన విషయమే అయినప్పటికీ, అదే సమయంలో మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఇదే స్ఫూ ర్తితో పారిశుద్ధ్య ప్రమాణాలను నిరంతరం కొన సాగిస్తూ వచ్చే ఏడాది కూడా రాష్ట్రస్థాయి అవా ర్డును సాధించేలా కృషి చేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు.స్వచ్ఛత అనేది కేవలం పరిస రాలను శుభ్రంగా ఉంచడానికే పరిమితం కాకూ డదని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇల్లు, ఇరుగుపొరుగు ప్రాం తాలు, వీధులు, గ్రామాలు, కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించి, ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు. స్వచ్ఛతను ప్రజా ఉద్యమంగా ముందు కు తీసుకెళ్లి స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ నకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు.అవార్డు అందుకున్న ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడిని అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బంది అభినందించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది, సూపర్వైజర్లు, అధికారులకు ఆయన స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనే జర్ కె. పద్మావతి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కె. గంగాధర్, అకౌంట్స్ ఆఫీసర్ వంశీ మోహిని, పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) జి.జి.వి. రమణ, విశాఖ జిల్లా డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్వైజర్లు, పర్సనల్, అకౌంట్స్, ఏటీఎం కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐసిఈ ఇనిషియేటివ్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఫీల్డ్ విజిట్

**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,అక్టోబర్03** దువ్వాడలోని విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అటానమస్ లో పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, డిజైన్ థింకింగ్, పారిశ్రామిక ఆలోచనా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో డెవలపింగ్ ఇన్నోవేషన్, క్రియేటివిటీ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇనిషియేటివ్లో భాగంగా ఫీల్డ్ విజిట్ అండ్ ఐడియా క్రియేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీఐఐటీకి చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ , కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ -- సైబర్ సెక్యూరిటీ విభాగాలు, వీసీఐఎస్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ, మల్కాపురం, విశాఖపట్నం మరియు కేంద్రీయ విద్యాలయ నం. 1, నౌసెనాబాగ్, విశాఖపట్నం పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు విజ్ఞాన్ ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్‌ను సందర్శించి, ఆవిష్కరణ, సృజనాత్మక ఆలోచన మరియు ఐడియా డెవలప్‌మెంట్‌పై ప్రాక్టికల్ అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో డా. కె. శ్రీనివాస నాయక్, ఎస్‌పీఓసీ, ఐడియా ల్యాబ్ ప్రొఫెసర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగం, వీఐఐటీ మరియు డా. చ. భరత్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, సీఎస్ఈ-సీఎస్ విభాగం, వీఐఐటీ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలు, పరిసరాల పరిశీలనను వినూత్న ఆలోచనలుగా ఎలా మార్చుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. ఆవిష్కరణ ప్రక్రియలోని వివిధ దశలైన పరిసరాలను పరిశీలించడం, సమస్యలు మరియు అవకాశాలను గుర్తించడం, ఆలోచనలను రూపొందించడం, సృజనాత్మకంగా ఆలోచించడం, సాధ్యమైన పరిష్కారాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమస్యల గుర్తింపు, సృజనాత్మక ఆలోచన, అవకాశాల గుర్తింపు, పరిష్కారాల రూపకల్పన మరియు పారిశ్రామిక నైపుణ్యాలపై ఇంటరాక్టివ్ చర్చలు, కార్యకలాపాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రెండు పాఠశాలలకు చెందిన 7, 8, 9 మరియు 12వ తరగతులకు చెందిన మొత్తం 160 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొన్నారు.కార్యక్రమానికి ఆయా పాఠశాలల యాజమాన్యాలు, ఎస్‌పీఓసీలు, ఉపాధ్యాయులు చురుకైన సహకారం అందించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ, మల్కాపురం ప్రిన్సిపాల్ శ్రీ సత్యజీత్ మిశ్రా; కేంద్రీయ విద్యాలయ నం. 1, నౌసెనాబాగ్‌కు చెందిన ఎస్‌పీఓసీలు శ్రీమతి ఆకృతి దూబే, శ్రీ సుధీర్ కుమార్ మైంగి; శ్రీ వి. సత్యం నాయుడు, ఆయా పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ మరియు ఏఐసీటీఈ ఆధ్వర్యంలో ప్రారంభమైన స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కార్యక్రమం పాఠశాల విద్యార్థుల్లో ఆవిష్కరణ, సృజనాత్మకత, డిజైన్ థింకింగ్, పారిశ్రామిక ఆలోచనా విధానాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. డిఐసిఈ ఇనిషియేటివ్ ద్వారా వీఐఐటీ విద్యార్థులకు సమస్యల గుర్తింపు, ఆలోచనల రూపకల్పన నుంచి ప్రోటోటైప్ అభివృద్ధి, స్టార్టప్‌లపై అవగాహన, మేధో సంపత్తి హక్కులు జిల్లా స్థాయి ప్రదర్శనలు మరియు డెమో డేస్‌లో ఆవిష్కరణలను ప్రదర్శించడం వరకు క్రమబద్ధమైన మార్గదర్శకత్వం మరియు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించేందుకు కృషి చేస్తోంది.



ఈ కార్యక్రమం డా. జె. సుధాకర్, ప్రిన్సిపాల్, వీఐఐటీ; డా. కె. రోహిత్ కుమార్, హెడ్, సైబర్ సెక్యూరిటీ విభాగం; డా. ఆర్. ఉమా మహేశ్వరి, హెడ్, ఈసీఈ విభాగం; డా. ఎ. సంపత్ దక్షిణామూర్తి, హెడ్, వీసీఐఎస్ మరియు సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్, ఈసీఈ విభాగం; డా. బి. ఓంకార్ లక్ష్మీ జగన్, ఇన్‌చార్జ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ మరియు అసోసియేట్ ప్రొఫెసర్, ఈఈఈ విభాగం; మరియు అరుణ, ఇన్‌చార్జ్, ఐఐసీ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్, సైబర్ సెక్యూరిటీ విభాగం మార్గదర్శకత్వం మరియు సహకారంతో నిర్వహించారు.

## ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సమక్షంలో టిడిపి సీనియర్ నాయకులు, పార్వతీపురం తెలుగుదేశం పట్టణ అధ్యకులు కోలా మధు జన్మదిన వేడుకలు



**పార్వతీపురం మన్యం,పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 3:** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి సీనియర్ నాయకులు , పార్వతీపురం తెలుగుదేశం పట్టణ అధ్యకులు కోలా మధు జన్మదిన వేడుకలు శనివారం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా , కోలా మధు కేక్ కట్ చేయగా, ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆయనకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో ఉన్నత పదవులతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు , కోలా మధుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల కోసం పనిచేస్తాం.. సమస్యలపై పోరాడుతాం

గాంధీ జయంతి సందర్భంగా మాజీ సర్పంచ్ కృష్ణవంశీకి ఘన సన్మానం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 3:** శాంతి, అహింసా మార్గాల్లో నడుచుకుంటూ తన జీవితాన్ని జాతికి అంకితం చేసిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కూటమి నాయకులు పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ కేంద్రంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కృష్ణారావు (కృష్ణవంశీ)ను నాయకులు, ప్రజలు ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు. మారుమూల గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కోసం ప్రజలు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలు కూడా అధికారులకు సహకరిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కృష్ణవంశీ మాట్లాడుతూ.. "పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పనిచేయడమే మా లక్ష్యం. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే పోరాటం చేస్తాం. ఎల్లప్పుడూ ప్రజల వైపు నిలబడి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తాం" అని అన్నారు.గాంధీజీ చూపిన శాంతి, అహింసా మార్గంలో ప్రజా సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనంద్, కూటమి నాయకులు ప్రజాపతి, నూకరాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

## అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజ రాణి కు అరుదైన అవకాశం

- ఐక్యరాజ్యసమితి 81వ సర్వసభ్య సమావేశనికి పిలుపు



**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 03:**గిరిజన బిడ్డ.. నూతన రాజకీయాలో చేరి నూతన రాజకీయ ఒరవడితో అందరి మన్ననాలు పొంది. తనదైన శైలిలో రాజకీయ ముద్ర వేసుకున్న అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజ రాణి కు అరకు నుంచి ఢిల్లీ మీదుగా అమెరికా వరకు అరుదైన అవకాశం దక్కింది. గిరిజన అరకు నుంచి ఢిల్లీ మీదుగా అమెరికా న్యూయార్క్ వరకు ప్రయాణించి ఐక్యరాజ్యసమితి జరిగే 81 వ సర్వసభ్య సమావేశంలో పాల్గొని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి నివేదిక ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు....18 మంది పార్లమెంట్ సభ్యుల భారత ప్రతినిధి బృందంలో ఒకరిగా.. మన తెలుగు ఆడపడుచుకు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజ రాణి కు అమెరికా న్యూయార్క్ లో 5 అక్టోబర్ 2026 నా ఐక్యరాజ్యసమితి 81వ సర్వసభ్య సమావేశనికి పాల్గొనే అరుదైన అవకాశని కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గిరిజన ప్రాంతమైన అరకు నుంచి అంతర్జాతీయ వేదికైన అమెరికా వరకు వెళ్ళడం గిరిజనులకు ఆనందనియంగ ఉంది.గిరిజన ప్రాంతానికి గర్వకారణమైన ప్రస్థానమని పలువురు గిరిజన మేధావులు ప్రశంసిస్తున్నారు. అరకు ఎం పి డాక్టర్ గుమ్మ తనూజ రాణి నూతన రాజకీయాలో మరిన్ని వేదికలకు గిరిజనుల తరుపున పాల్గొని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఎంతగానో కృషి చేయాలని గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాలు పార్టీలకు అతీతంగా కొనియాడుతున్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

- పార్వతీపురంలో శారీరక దివ్యాంగులకు ఉచిత త్రిచక్ర వాహనాల పంపిణీ
- త్రిచక్ర వాహనాలు ఉపాధికి, ప్రగతికి ఊతమివ్వాలి: ఎమ్మెల్యే విజయచంద్ర




**పార్వతీపురం మన్యం పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 3:** విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 3వ తేదీ శనివారం పార్వతీపురం మన్యం జూనియర్ కళాశాల మైదానంలో శారీరక దివ్యాంగులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయచంద్ర మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం కోసం సంక్షేమ శాఖ చైర్మన్ ప్రత్యేకంగా జిల్లాకు విచ్చేసి వారి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. దివ్యాంగులు చాలా ప్రత్యేకమైన వారని, వారు ఎవరిపైనా ఫిర్యాదులు చేయకుండా, ఎటువంటి దురాలోచనలు లేదా కుతంత్రాలు లేకుండా ఎంతో నిజాయితీగా పనిచేస్తారని కొనియాడారు. ఈ రోజు అందజేసిన ఉచిత త్రిచక్ర వాహనాలు కేవలం ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి వెళ్లేందుకు ప్రయాణ సాధనంగా మాత్రమే కాకుండా, వారి జీవితాలను ముందుకు తీసుకెళ్లేందుకు, ఉపాధి పొందడానికి ఉపయోగించి, సమాజంలో పదిమందికి స్ఫూర్తిగా నిలిచేలా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పూర్తి చిత్తశుద్ధితో కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గుర్తుచేశారు.

## ఇది ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

### మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో పాడేరు టిడిపి ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి



**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 03:**కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పాలన సాగిస్తుందని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆమె శనివారం పాడేరు మండలం పంచాయతీ గురుపల్లి గ్రామంలో మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడుతూ...
సమస్యలన్నీ భూవివాదాలేనని అందువల్లనే భవిష్యత్తులో భూమిపై వివాదాల తలెత్తకూడదన్న ఉద్దేశంతో అత్యంత పారదర్శకంగా రీసర్వే నిర్వహించి రైతుల ఫోటోలతో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను కూటమి ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.
రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస పుస్తకాలను అందజేశారు. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత అందులోను హైవే ఏర్పడిన తర్వాత భూమికి మరింత విలువ పెరిగిందన్నారు. భూ వివాదాల తలెత్తకూడదనే ఉద్దేశంతో భవిష్యత్తులో ఒకరి సరిహద్దులను ఇంకొకరు మార్చే ప్రయత్నం చేయడానికి అవకాశం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం అత్యంత పగడ్బందీగా రైతుల సమక్షంలో రీసర్వే చేపట్టిందన్నారు. ఈ రీసర్వే చేసిన భూములు సరిహద్దులను మనం డిజిటల్ లో ఎక్కడి నుంచైనా చూసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మన అనుమతి లేకుండా మన హక్కులను మార్చే ప్రయత్నం ఎవరూ చేయడానికి వీలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వివాదాలు ఉన్న భూములు విషయంలో జాగ్రత్తగా అడుగులు వేయాలని ఒకరు భూమి యజమానికి బదులు వేరే వ్యక్తికి బదిలీ చేశారని ఆరోపణలు ఉన్నా భూములను సర్వే చేయొద్దని దాని ప్రత్యేక కోణంలో చూడాలని ఇరు పార్టీలు సమక్షంలో క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు మాత్రమే దానిని సర్వే చేసి రైతులకు అప్పగించాలని రెవెన్యూ అధికారులకు ఈ సందర్భంగా ఆమె సూచించారు. భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించి ప్రజల పక్షాన నిలిచేలా రెవెన్యూ అధికారులు సహకరించాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన మాటను గుర్తు చేశారు. భూమితోనే రైతుల జీవన విధానం ముడిపడి ఉంటుందని భూమితో వారికి ఉన్న అనుబంధం ప్రత్యేకమని అక్కడ ఏ సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత మనదేనన్నారు. ఈ కార్యక్రమంలో జి సి సి డైరెక్టర్ బొర్ర నాగరాజు , మాజీ ఎంపీపీ బొర్ర విజయ రాణి , పాడేరు పిఎసిఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ , మాజీ సర్పంచ్ పార్వతమ్మ , రెవెన్యూ అధికారులు గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

## అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 3:** వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆర్.వి. నగర్ రేంజ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో జీకే వీధి దేరాలలోని ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల (బాలికల)లో 'ఏఎస్ఆర్ అరణ్య' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆర్.వి. నగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మణికృష్ణ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందించారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతి సంపదను కాపాడేందుకు విద్యార్థులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని వివరించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో కె. కృష్ణారావు, ఎఫ్ఎస్‌వోలు మహేష్, పుష్ప, ఎఫ్‌బీవోలు భూషణం, ఈశ్వర్, భద్రంతో పాటు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల స్థాయిలో సమావేశాలు



**అనంతరమే అభ్యర్థులు ఎంపిక చేసుకుందాం**

**పాడేరు నియోజక వర్గం తెదేపా ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి**

**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 03:** నియోజకవర్గ స్థాయి కూటమి పార్టీల సమన్వయ సమావేశాలు తరహాలోప్రతి మండల స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించుకున్న తర్వాత మాత్రమే ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఎంపికను పూర్తి చేద్దామని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి , మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి స్పష్టం చేశారు పాడేరులోని శనివారం శంకరన్ ఆడిటోరియంలో తెలుగుదేశం పార్టీ బిజెపి, జనసేన పార్టీల నాయకుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గిడ్డి ఈశ్వరి పాల్గొని కూటమి నేతలు కార్యకర్తలను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ.... అధిష్టానం సూచనలతో పాటు మనపై కూడా ఒత్తిడి తగ్గించాలనే ఆలోచనతో తాను ఒక సూచన చేస్తున్నానని ఈరోజు నియోజకవర్గ స్థాయిలో జరిగేటువంటి సమావేశాలు తరహాలో మండల స్థాయిలో కూడా అన్ని పార్టీ శ్రేణులతో నిర్వహించిన తర్వాత మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేసుకుంటే అంత సజావుగా సాగుతుందని ఆమె అన్నారు. ఇది అందరికీ ఆమోదయోగ్యమైతే ముందుకు వెళ్లాలని సూచించారు. ఏ పార్టీ నుంచి అభ్యర్థి అయిన గెలుపు కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు ఐక్యంగా పనిచేస్తే శతశాతం విజయం సాధ్యమవుతుందని అన్నారు. గిరిజన ప్రాంతంలో కూటమి పోటీ చేసిన ప్రతి స్థానంలో గెలిచేందుకు ఈ రోజు అవకాశం ఉందని చెప్పారు. అభ్యర్థుల ఎంపిక పూర్తయిన తర్వాత గెలుపే ప్రధానంగా అడుగులు వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తరఫున ఆంధ్రప్రదేశ్ జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు. గంగులయ్య , బిజెపి తరపున ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి, ఇతర కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## దోకులూరు--పెదలంక రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ పరిధిలోని పెదలంక గ్రామంలో పీఎం జన్మన్ పథకం ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. మాజీ సర్పంచ్ కృష్ణారావు, దోకులూరు, పెదలంక గ్రామ పెద్దల చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కృష్ణారావు మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు రహదారి సౌకర్యం మెరుగుపరిచి, డోలీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు పంచాయతీ ప్రజలు, పెదలంక గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.దోకులూరు నుంచి పెదలంక వరకు సుమారు రూ.1.80 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ రహదారి అభివృద్ధితో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కృష్ణవంశీ, కోటి పాల్స్, మర్రి చంటిబాబు, ఆనంద్ పాల్‌తో పాటు గ్రామ పెద్దలు గబ్బులంగి అప్పారావు, గబ్బులంగి కృష్ణ, సంకుర్మాయ రామన్న, గబ్బులంగి బుజ్జిబాబు, కిలో అప్పారావు, బాలన్న, వాసు తదితరులు పాల్గొన్నారు. దోకులూరు, పెదలంక గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పంచాయతీ కార్మికులు సమ్మె విరమణ

దిగొచ్చిన పంచాయతీ అధికార్లు



**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 03:**పాడేరు పంచాయతీ పారిశుద్ధ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని గాంధీ జయంతి వేడుకలను నిరసిస్తూ గాంధీ జయంతి రోజు నుండి సమ్మె బాటకు పిలుపు ఇచ్చారు..... ఈ మేరకు శనివారం పాడేరు పంచాయతీ కార్యాలయం ముందు 2వ రోజుకు సమ్మె చేరడంతో .. దిగొచ్చిన పాడేరు మేజర్ పంచాయితీ ఎగ్జిక్యూట్ ఆఫీసర్ రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు, పంచాయతీ యూనియన్ నాయకులు వసంత్, అర్జున్ తో డిమాండ్లపై చర్చించారు. సుదీర్ఘంగా జరిగినచర్చల్లో
పాడేరు మేజర్ పంచాయితీ ఎగ్జిక్యూట్ ఆఫీసర్ రమేష్, స్పందిస్తూ సామాజిక భద్రత పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కార్మికులందరికీ కల్పిస్తామని, పనిభారం తగ్గించేందుకు సిబ్బందిని పెంచుతామని, అదేవిధంగా మినిమం రూ 1200 వేతనం పెంచడానికి, ప్రతి నెల 16వ తేదీన వేతనం ఇవ్వడానికి రాతపూర్వకంగా అగ్రిమెంట్హామీ ఇచ్చారు. డిమాండ్లు పరిష్కారం కావడంతో కార్మికులు 2వ రోజు నుంచి సమ్మె విరమించారు. డిపిఓ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటీ ఆఫీసర్ రమేష్ వారి ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులకు వారి చేతుల మీదుగా నిమ్మరసం ఇచ్చి సమ్మెను విరామింప చేశారు. అనంతరం కార్మికుల ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు మాట్లాడుతూ ఒప్పందంలోని అంశాలని రేపటినుండి అమల్లోకి రావాలని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ 26000 ఇచ్చేవరకు భవిష్యత్తులో దప దపాలుగా పోరాడతామని అన్నారు. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పాడేరు మండల కన్వీనర్ ఎం ప్రసాద్,కార్మికులు బాలన్న,సూరిబాబు, మోహన్, అప్పారావు కార్మికులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత- ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 03 పెన్ పవర్.**దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ,వారికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోందని ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు.పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం నాడు విభిన్న ప్రతిభావంతులు,హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శారీరక దివ్యాంగులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేందుకు,విద్య, ఉపాధి,ఇతర అవసరాల కోసం సులభంగా రాకపోకలు సాగించేందుకు మూడు చక్రాల స్కూటర్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గుడిపూడి నారాయణ స్వామి,జిల్లా రెవెన్యూ అధికారి కె హేమలత,సంబంధిత శాఖల అధికారులు,నాయకులు నంగిరెడ్డి మధుసూదన్ రావు,దేవకోటి వెంకటనాయుడు,మరడాన తవిటినాయుడు,శ్రీనివాసరావు,శ్రీకర్,తిరుపతి నాయుడు,దివ్యాంగులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# స్వాతంత్రం నాటికల నెరవేరింది కూటమి ప్రభుత్వ పాలనలో నేడిలా



**పాములాయి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణనికి శంకుస్థాపన.**

**దాదాపు 1.26 కోట్లతో 80 పివిటిజి కుటుంబాలు ఉన్న గ్రామానికి తారు రోడ్డు.**

**హుకుంపేట పెన్ పవర్ అక్టోబర్ 3 :**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం తీగలవలస పంచాయతీ పాములాయి గ్రామంలో దశాబ్దాల నాటి కల త్వరలో నెరవేరబోతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఆ గ్రామానికి రహదారి సౌకర్యమే లేదు. అభివృద్ధికి 10 దశాబ్దాల దూరంలో ఉండేది. తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర చొరవతో నూట ఎనభై మంది పివిటిజీలు ఉండే ఆ గ్రామానికి రహదారి మంజూరు అయింది. కోటి 25 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న ఆ తారు రోడ్డు పనులకు దొన్ను దొర శనివారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తుందని జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలన ఆకాంక్షతో పాలన సాగిస్తుందన్నారు. ఇక్కడ రోడ్డు వేస్తే ప్రభుత్వానికి ఎంత మేలు జరుగుతుందని కాకుండా గిరిజన ప్రజల జీవన విధానంలో మార్పు రావాలి అని వారి ఆర్థిక పురోభివృద్ధి సాధించాలనీ వారి నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన చేయాలన్న తపనతో కేవలం 80 కుటుంబాలు నివాసం ఉండే పాములాయి గ్రామానికి కోటి 25 లక్షలు కేటాయించడమే దీనికి సాక్ష్యం అన్నారు. పి వి టి జీ గ్రామాల్లో అభివృద్ధి వెలుగు చూడాలన్న తపనతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. 79 సంవత్సరాలుగా ఈ గ్రామాన్ని దిక్కు చూడని పాలకులు ఉన్నారంటే సిగ్గు పడాలన్నారు. చంద్రబాబునాయుడు నరేంద్ర మోడీ అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పన చేయాలని పిలుపునిస్తున్నారన్నారు. అందుకే ఈరోజు ఈ గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పడుతుందంటే ఆ ఇద్దరు నాయకుల సంకల్పం దానికి పవన్ కళ్యాణ్ తోడు కావడమే కారణం అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మారుమూల ప్రాంతాల అభివృద్ధిని మాట అటు ఉంచితే ప్రధాన పంచాయతీలను గాని పట్టణాలను గాని గ్రామాలను గాని పట్టించుకున్న పాపానికి కూడా పోలేదన్నారు. అభివృద్ధి అనే మాటే వైసిపి హయాంలో వినిపించలేదు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గ్రామానికి రహదారి నిర్మిస్తున్నారని ప్రతి ఊరిలో సిసి రోడ్లు తాగేందుకు మంచినీళ్లు ఉండేందుకు ఇల్లు ఇస్తున్నారు. గిరిజన ప్రజలకు అంత మేలు చేస్తున్న ప్రభుత్వానికి మనం కూడా అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే తీగలవలస పంచాయతీ పాములాయి బీజపల్లి చుట్టు పక్కల గ్రామలలో నుండి వైస్సార్సీపీ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీ లో పార్టీ యొక్క పరిపాలన నిబంధనలు నచ్చి సుమారు గా 80 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ లో కండువాలు కప్పుకున్నారు అంటే ప్రభుత్వం పని ఎలా ఉందొ అన్న విషయం ప్రజలకే అర్థమవుతుందని తెలుగుదేశం నాయకులు అన్నారుఈ కార్యక్రమంలో హుకుంపేట మండలం అధ్యక్షుడు శతక బొంజు బాబు, ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్ లకే.నాగేశ్వరరావు మజ్జి,బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణరాజు, సిర్గం.సూర్యకాంతం, సాగరి.సత్యవతి, అరకువ్యాలీ మాజీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, మాడగడ మాజీ సూపర్ ఎంపిటిసి వంతల వెంకటరావు, డుంబ్రిగూడ క్లస్టర్ ఇంచార్జి కొర్ర నాగరాజు, అరకు వ్యాలీ క్లస్టర్ ఇంచార్జి కో కన్వీనర్ కిల్లో మోహన్ దాస్ పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పట్టే బోయిని. శంకర్ నాయుడు, అరకు నియోజవర్గం ఐటిడిపి అధ్యక్షులు జన్ని.వెంకటరమణ, క్లస్టర్ ఇంచార్జి కూడేలి నూకరాజు , తీగలవలస మాజీ సర్పంచ్ పల్టా సింగ్. కామేష్,,ఎంపిటిసి బాబురావు, కిమ్ముడు సుధాకర్,శెట్టి.జయరాం కుమార్, తీగల వలస పంచాయతీ గ్రామకంఠ అధ్యక్షుడు బోయిని.మోహన్ రావు, ఎడే.చిట్టిబాబు, సాంబె.బాబురావు, తామర్ల. సుబ్బారావు,బోయిని.చిన్నయ్య, పాలసీ.అప్పారావు జనసేన మండల అధ్యక్షుడు బలిజ. కోటేశ్వరరావు పడాల్, జిల్లా కార్యనిర్వక సభ్యులు పరిధిని సురేష్, కార్యదర్శి జన్ని లింగన్న, జనసేన సీనియర్ నాయకులు , కోర్ కమిటీ సభ్యులు మజ్జి రామకృష్ణ , మహేష్ , బాలు, నిర్మల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బధిరుల సంకేత భాషపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, అక్టోబర్ 3:** బధిరుల సంకేత భాషపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు కె. కవిత అన్నారు. ప్రపంచ బధిరుల దినోత్సవం, అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవ వేడుకలను శనివారం పాడేరులోని కాఫీ హౌస్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లా బధిరుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కె. కవిత మాట్లాడుతూ.. బధిరుల సంకేత భాష అందరికీ తెలిసేలా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సంకేత భాషకు సంబంధించిన సమాచారాన్ని ప్రదర్శించాలని సూచించారు. బధిర ఉద్యోగుల సహకారంతో ఇతర ఉద్యోగులకు సంకేత భాషపై అవగాహన కల్పించాలని అన్నారు. బధిరులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన అనంతరం కూడా తమ బధిరుల సంఘంలో సభ్యులుగా కొనసాగుతూ సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం బధిరులు, మూగవారికి ఉచితంగా వినికిడి యంత్రాలు, స్పర్శ ఆధారిత ఫోన్లు, మడత కంప్యూటర్లు వంటి సహాయక పరికరాలను అందజేస్తోందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బధిరుల సంకేత భాష శిక్షకురాలు లక్ష్మీ, జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి జి. గౌరీశంకర్, రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎస్. గంగరాజు, బధిరుల సంఘం ప్రతినిధులు లాండ కుమారస్వామి, సత్యనారాయణ, హాసన్ బేగ్, భవానితో పాటు పలువురు పాల్గొన్నారు.

## బొంగరం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

**యుద్ధ ప్రతిపదికన బ్రిడ్జి వేస్తూ చర్యలు తీసుకోవాలని**

**గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్**




**పాడేరు/పెదబయలు:పెన్ పవర్: అక్టోబర్ 3:** పాడేరు నుంచి బొంగరం వరకు నడిచే ప్రభుత్వ ఆర్టీసీ బస్సు సర్వీసును బొంగరం వరకు వెంటనే పునరుద్ధరించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మణుగూరు బాబుజీ, బూడిదే మాధవరావు ప్రభుత్వానికి , ఆర్ టి సి అధికార్లకు డిమాండ్ చేశారు. వారు శనివారం మీడియాతో మాట్లాడుతూ...ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గోమంగి ఏపీఆర్ స్కూల్ సమీపంలోని మర్రిపుట్టు బ్రిడ్జి చివర భాగం తీవ్రంగా కోతకు గురైంది. ఈ ప్రమాదకర పరిస్థితి వల్ల బొంగరం వెళ్లాల్సిన బస్సు ప్రతిరోజూ గోమంగి నుంచే వెనుతిరిగిపోతోందనీ బస్సు రాకపోకలు నిలిచిపోవడంతో గిన్నెలకోట, ఇంజేరి, లింగేటి, బొంగరం, కుంతుర్ల గిరిజన పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ ,ఈ ప్రాంత వాసులకు జిల్లా కేంద్రానికి, మండల కేంద్రాలకు వెళ్లాలన్నా, ఆసుపత్రి అత్యవసర సేవలకు, నిత్యావసర సరుకుల రవాణాకైనా ఈ ఒక్క బస్సే ఏకైక ఆధారమని, బ్రిడ్జి దెబ్బతినడంతో ప్రస్తుతం ఆటోలు, జీపులు కూడా తిరగలేని పరిస్థితి నెలకొంది యుద్ధ ప్రతిపదికన బ్రిడ్జి వేస్తూ బస్సు సర్వీసులు జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వ ఉదాసీనతపై ఆగ్రహం..**

ఇంత జరుగుతున్నా, ఇన్ని రోజులైనా ప్రభుత్వం కానీ, ఆర్ టి సి అధికార్లు కానీ స్పందించకపోవడం దురదృష్టకరమని గిరిజన విద్యార్థి సంఘం నేతలు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి, యుద్ధప్రాతిపదికన బ్రిడ్జి మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. బస్సును తిరిగి బొంగరం గ్రామం వరకు నడిపించి గిరిజనుల రవాణా కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు.దప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోకపోతే, ఐదు పంచాయతీల ప్రజలను మరియు విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున నిరసనలు, ప్రజా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.
వివిధ గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు

## 'మీ భూమి--మీ హక్కు' పత్రాల పంపిణీ

- రీ--సర్వే పూర్తయిన ఐదు గ్రామాల్లో పంపిణీకి ఏర్పాట్లు




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 3:**గూడెంకొత్తవీధి మండలంలో రీ--సర్వే పూర్తయిన గ్రామాల్లో 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం ద్వారా భూ హక్కు పత్రాల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు తెలిపారు.మండలంలోని ఐదు గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 5న ఎం.బూసికొండలో ఉదయం, జి.నీరోడుపల్లిలో మధ్యాహ్నం పత్రాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 7న వీరవరం, 8న గూడెం పాతవీధి, 9న డి.అన్నవరం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.సంబంధిత గ్రామాల రైతులు నిర్ణీత తేదీల్లో తప్పనిసరిగా హాజరై తమ భూ హక్కు పత్రాలను స్వీకరించాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో పీసా గ్రామ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ద

## ప్రజా దర్బార్లో పలు సమస్యలను పరిష్కరించిన ప్రభుత్వ విప్.




**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 03 పెన్ పవర్.** మండల కేంద్రంలోని కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నాడు ప్రభుత్వ విప్,తోయక జగదీశ్వరి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు ప్రజలు ఎమ్మెల్యేని కలిసి తమ వ్యక్తిగత,స్థానిక సమస్యలను వివరించి వినతిపత్రాలు అందజేశారు.వారి సమస్యలను ఎమ్మెల్యే సావధానంగా విని,సంబంధిత అధికారులతో మాట్లాడిపరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.అదే సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యేని కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు.రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని,నెలకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని వారు కోరారు.అలాగే ప్రభుత్వ పరంగా ఉద్యోగులకు అందాల్సిన ఇతర ప్రయోజనాలను కూడా వర్తింపజేయాలని ఎమ్మెల్యే గారికి విజ్ఞప్తి చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ఎమ్మెల్యే సానుకూలంగా విని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.

## సిఆర్ఎం టీచర్స్ సమస్యల పరిష్కారానికి 5న ఆందోళన



- **15ఏళ్లుగా పని చేస్తున్న తమకు డిఎస్సీలో వెయిటేజ్ కల్పించాలి.**
- **సిఆర్ఎం టీచర్స్ కు పూర్తి స్థాయి టీచర్స్ గా గుర్తించాలి.**
- **న్యాయ మైనా సమస్య తక్షణమే ప్రభుత్వం పరిష్కారం చేయాలి.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 03.**పాఠశాల విద్యాలో పనిచేస్తున్న సిఆర్ఎం టీచర్స్ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఏ.పి. సి.ఆర్.ఎం. టీచర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అక్టోబర్ 5న రాష్ట్ర సమగ్ర శిక్ష ఎస్ పిడి ఆఫీసు దగ్గర ఆందోళన నిర్వహిస్తామని ఏపీ సిఆర్ఎం టీచర్స్ యూనియన్ పిలుపునిచ్చారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చేపడుతున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొంటున్నామని శనివారం సమస్యలతో కూడిన వినతి పత్రం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బందికి అందజేసినట్లు సిఆర్ఎం టీచర్స్ మండల కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జి.ఓ. ఎం.ఎస్ నెం.65 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం సృష్టించిన 4034 సి.ఆర్.ఎం. టీచర్స్ పోస్టులలో డిగ్రీ, బి.ఈడి. మరియు డి.ఈడి ఉత్తీర్ణత వంటి స్కూల్ అసిస్టెంట్ అర్హతలతో పనిచేస్తున్న సి.ఆర్.ఎం. టీచర్లను రెగ్యులర్ చేయాలన్నారు. అప్పటివరకు స్కూల్ అసిస్టెంట్ బేసిక్ వేతనం 44, 570 రూపాయలు ఏపీపీసీ 2022 అనుసరించిన మినిమం ఆఫ్ ది స్కేలు అమలు చేసి వేతనాలు పెంచాలని, గత 9 సంవత్సరాలుగా ఏ విధమైన వేతన పెంపుదల లేకుండా రూ.23,500ను వేతనాలుగా చెల్లిస్తుండుట వలన పెరిగిన అధిక ధరలతో కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. పాఠశాల విద్యలో 15 ఏళ్లుగా స్కూల్ అసిస్టెంట్ అర్హతలతో పనిచేస్తున్న సిఆర్ఎం టీచర్స్ కు డిఎస్సిలో వెయిటేజీ ఇవ్వాలని, సిఆర్ఎం టీచర్స్ వృత్తిలో పనిచేస్తుండుట వలన ట్రావెలింగ్ అలవెన్స్ నిలుపుదల చేయడంతో ట్రావెలింగ్ ఖర్చులు తమకు వచ్చే వేతనాలు నుంచే భరిస్తూ పెడుతున్నందున ట్రావెలింగ్ అలవెన్స్ తక్షణమే పునరుద్ధరించాలనీ డిమాండ్ చేశారు. సిఆర్ఎం టీచర్స్ రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, అలాగే రిటైర్మెంట్ అయిన వారికి గ్రాట్యుటీ ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులగా గుర్తింపు, పిఎఫ్ మరియు ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. సిఆర్ఎం టీచర్స్ ఎవరైనా అనారోగ్యనికి గురి అయి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబంలో అర్హులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. పైన పేర్కొన్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 5న రాష్ట్ర సమగ్రశిక్ష ఎస్.పి.ఓ ఆఫీసు నందు ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏం అనిల్ కుమార్ కె హరి జి ఈశ్వర్ రావు బి భాస్కర్ రావు ఎస్ గౌరీ శంకర్ పి సూర్య నారాయణ వి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో గ్రామాలకు అభివృద్ధి వరాలు....




- **చిన గొలుగొండపేట,ధర్మవరం, గునుపూడిలో రూ.95 లక్షలతో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన.....**
- **సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట.....**
- **అయ్యన్నపాత్రుడు సారథ్యంలో నాతవరం మండలంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం......**
- **మండల టిడిపి పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ....**

**నాతవరం,పెన్ పవర్ (అక్టోబర్ 03):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని నాతవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు.శనివారం నాతవరం మండలంలోని చిన గొలుగొండపేట, ధర్మవరం, గునుపూడి గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగ 3.0 కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.95 లక్షల నిధులతో చేపట్టనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నందిపల్లి వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సారథ్యంలో నాతవరం మండలంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని నందిపల్లి వెంకటరమణ అన్నారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ గ్రామాలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.మండల తెలుగు యువత అధ్యక్షులు పోలుపర్తి సాయి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గునుపూడి గ్రామానికి ఇప్పటివరకు సుమారు రూ.1.19 కోట్ల అభివృద్ధి నిధులు కేటాయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ అభివృద్ధికి తగిన ప్రాధాన్యత లభించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే గునుపూడిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.గునుపూడి గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడికి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా గ్రామానికి మరిన్ని అభివృద్ధి పనులు మంజూరై ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొంద్రు మరిడియ్య, పీకే గూడెం పీఏసీఎస్ అధ్యక్షులు అంకంరెడ్డి నాని బాబు, టీడీపీ సీనియర్ నాయకులు భాస్కరరావు, గోవిందు, మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు శెట్టి లోవ, గున్న అబ్బాయి మాస్టారు, మండల అభివృద్ధి అధికారి ఎం. సత్య శ్రీనివాస్, పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ, ఎస్.బి.పట్నం మాజీ సర్పంచ్ లోకవరపు సతీష్, పీకే గూడెం రమణతో పాటు టీడీపీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి

**మంద కృష్ణ మాదిగకు విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం వినతి**



**విశాఖ , పెన్ పవర్, అక్టోబర్ 03:**నాయి బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించేం దుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి న్యాయం చేయాలని కోరుతూ విశాఖ జిల్లా నాయి బ్రాహ్మ ణ సేవా సంఘం రి.నెం. 500/82 ఆధ్వర్యంలో సంఘం ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు ఉద్య మ నాయకులు మంద కృష్ణ మాదిగను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నరవ పైడిరాజు మాట్లాడుతూ.నాయి బ్రాహ్మణులు ప్రస్తుతం బీసీ-ఏ కేటగిరీలో సీరియల్ నంబర్ 16 లో ఉన్నారని తెలిపారు. బీసీ-ఏ వర్గంలో అనేక ప్రధాన కులాలు ఉండటంతో నాయి బ్రాహ్మణు లకు తగిన స్థాయిలో రిజర్వేషన్ ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణు ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమను ఎంబీసీ వర్గీకరణలోకి తీసుకురావడానికి సహ కరించాలని మంద కృష్ణ మాదిగను కోరారు. తద్వారా విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో కుల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ ప్రయోజ నాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.అలాగే కూటమి ప్రభుత్వం చేతివృత్తిదారులు, బీసీ కులాలకు చెందిన వారికి 50 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్ అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని నరవ పైడిరాజు తెలిపారు. ప్రస్తుతం కొన్ని కులాలకు మాత్రమే ఈ పథకం అమలు చేస్తున్నారని, కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నిరుపేద నాయి బ్రాహ్మణు లకు కూడా 50 సంవత్సరాలకే పెన్షన్ అందించా లని కోరారు.ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నాయి బ్రాహ్మణులకు న్యాయం జరిగే లా కృషి చేయాలని మంద కృష్ణ మాదిగను కోరు తూ వినతిపత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో సంఘం అదనపు కోశాధికారి మల్లువలస వర్మతో పాటు ఎంఆర్‌పీఎస్ నాయ కులు పాల్గొన్నారు.

# కూటమి విజయానికి సమిష్టిగా కృషి చేయాలి

- ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల జాబితాను అధిష్టానం ప్రకటిస్తుంది



**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు, పెన్ పవర్, అక్టోబర్ 3:**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పాడేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్, రాష్ట్ర జానపద కళలు--సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య అన్నారు.పాడేరు శంకరన్ ఆడిటోరియంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులతో నియోజకవర్గ స్థాయి కూటమి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ గంగులయ్య కూటమి నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను పార్టీ అధిష్టానానికి పంపిస్తామని, అభ్యర్థులను అధిష్టానమే ప్రకటిస్తుందని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సమన్వయ సమావేశాల తరహాలో ప్రతి మండల స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించి, ఆయా మండలాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు.అభ్యర్థుల ప్రకటన అనంతరం కూటమి పార్టీలన్నీ సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. గిరిజన ప్రాంతంలో కూటమి పోటీ చేసే ప్రతి స్థానంలో విజయానికి సమష్టి కృషి అవసరమని అన్నారు. పార్టీ అధిష్టానం సూచనలు, నిర్ణయాలకు అనుగుణంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, జనసేన పార్టీ తరఫున డాక్టర్ వంపూరు గంగులయ్యతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుస్తక జ్ఞానానికి క్షేత్రస్థాయి అనుభవం

వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన కేజీబీవీ విద్యార్థులు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 3:**వ్యవసాయ పారిశ్రామిక సందర్శన కార్యక్రమంలో భాగంగా గూడెంకొత్తవీధి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు వ్యవసాయ పరిశోధనలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సాగు విధానాలు తదితర అంశాలపై పరిశోధనా కేంద్రం సిబ్బంది ద్వారా అవగాహన పొందారు. వ్యవసాయ రంగంలో జరుగుతున్న పరిశోధనలు, వాటి ద్వారా రైతులకు అందుతున్న ప్రయోజనాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ వ్యవసాయ ఉపాధ్యాయురాలు, ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రాయోగిక అవగాహన కల్పించేందుకు ఇటువంటి సందర్శనలు ఎంతగానో దోహదపడతాయని పాఠశాల ప్రిన్సిపల్ గొర్లె లావణ్య సరస్వతి తెలిపారు.

## అగ్రహారం కాలువపై తాత్కాలిక వంతెన పనులు ప్రారంభం

- యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు..
- పంచాయతీరాజ్ పీఐయూ నిధులతో పనులు



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, అక్టోబర్ 3:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని అగ్రహారం కాలువపై కొట్టుకుపోయిన వంతెన స్థానంలో తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల సంభవించిన తీవ్ర తుఫాను కారణంగా వంతెన కొట్టుకుపోవడంతో పరిసర గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు, విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.సమస్య తీవ్రతను గుర్తించిన స్థానిక కూటమి నాయకులు విషయాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఉపముఖ్యమంత్రి తక్షణమే ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.ఈ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పీఐయూ అధికారులు రంగంలోకి దిగి, ప్రత్యేక నిధులతో తాత్కాలిక వంతెన నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. స్థానిక కూటమి నాయకుల పర్యవేక్షణలో పనులు వేగంగా కొనసాగుతున్నాయి.తాత్కాలిక వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. వంతెన అందుబాటులోకి వస్తే పరిసర గ్రామాల ప్రజలకు, విద్యార్థులకు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి రవాణా సమస్యలు తొలగనున్నాయి.

# కేజీహెచ్‌లో సేవా సంకల్ప వైద్య శిబిరం

**ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 03 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో శనివారం సేవా సంకల్ప వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన వివిధ విభా గాలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి.వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, లెప్రసీ, క్షయ వ్యాధి నివార ణ, ఆర్‌బీఎస్‌కే, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, మలేరియా, డెంగ్యూ తదితర కార్యక్రమాలకు సంబంధించిన స్టాళ్ల ద్వారా ప్రజలకు ప్రభుత్వ ఆరోగ్య పథకా లు, వైద్య సేవలపై అవగాహన కల్పించారు. పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులు స్టాళ్ల వద్ద ప్రజలకు వైద్య పరీక్షలు, సలహాలు అందించారు.శిబిరంలోని స్టాళ్లను ఎమ్మెల్యేలు పి. విష్ణు కుమార్ రాజు, గంటా శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా పి. విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎంజేవై, ఆయుష్, మహిళా సంరక్షణ, వ్యాక్సినేషన్ తది తర పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహ న కల్పించాలని కోరారు. అనంతరం ఆయన రక్తపోటు పరీక్ష చేయించుకున్నారు. ప్రజలంద రూ ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందు బాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి, డీసీహెచ్‌ఎస్ డా. ఆర్. నరేంద్ర సింగ్, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ బి.వి. రమణ, డీఎల్ఏటీఓ డా. ఆర్. రమేష్, డీఐఓ డా. లూసీ, డీపీఎంఓ డా. బి. ఉమావతి, జిల్లా ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డా. బి. హారిక, ఎన్టీఆర్ వైద్య సేవల సమన్వయకర్త డా. కె. అప్పారావు, డా. బి. కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 డా. పద్మావతి, డీఎస్ఓ డా. ప్రదీప్ రాజా, డీపీఓ జి. శశి భూషణ్, ఏపీఎంఓ బి. నాగభూషణం తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుళ్ళిన నూనెతో జిలేబీలు తయారీ - ప్రజల ప్రాణాలతో చెలగాటం





- 10 రోజులుగా వాడేసి నిల్వ ఉంచిన ఆయిల్ తో జిలేబీలు, సమోసాలు తయారీ.
- పర్యవేక్షణ లోపం దీనికి కారణం అంటున్న ప్రజలు.
- రాజస్థాన్ జిలేబీ దుకాణాలపై చర్యలకు డిమాండ్.
- ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 03.**ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గల రాజస్థాన్ జిలేబిలు, సమోసాల దుకాణాల్లో కుళ్ళిన కల్తీ ఆయిల్ మరియు గడువు మీరిన నూనెలతో సమోసాలు, జిలేబిలు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రజల అమాయకత్వని ఆసరాగా చేసుకుని వారి ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నటువంటి రాజస్థాన్ జిలేబి, సమోసా దుకాణాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం రోజున వారపు సంతల్లో వచ్చినటువంటి ప్రజలకు స్వచ్ఛమైన మంచి నూనెతో జిలేబిలు సమోసాలు తయారుచేసి అమ్మకుండా పది, పదిహేను రోజులు క్రితం ఉపయోగించిన ఆయిల్ తో జిలేబిలు సమోసాలు తయారు చేసే అమ్ముతూ, చేపలు వాసన వచ్చే కంపు కొడుతూ ఉన్నటువంటి జిలేబీలు సమోసాలను ప్రజలకు విక్రయించారన్నారు. సంతకు వచ్చిన ప్రజలు కొనుగోలు చేయగా ఈ విషయం చాలా ఆలస్యంగా వెలుగులు వచ్చిందని దీనిపై తక్షణమే ఫుడ్ ఇన్స్పెక్టర్ అలాగే ఎమ్మార్వో స్థానిక ఎస్సై ఎంపీడీవో లు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గడువు ముగిసిన నూనెతో తిను బండరాలు తయారు చేస్తున్నటువంటి రాజస్థాన్ జిలేబి సమోసాల సెంటర్ లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాడిన నూనె పదేపదే వాడటం వల్ల హానికరమైన రసాయనాలు విడుదలై క్యాన్సర్, గుండె జబ్బులు, జీర్ణ సమస్యలు తదితర సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. కాగా అధికారుల పర్యవేక్షణ లోపమే ఇలాంటి ఘటనలు జరగడానికి కారణంగా పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, చందు, లోబో, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# 18న ఆర్గానిక్ సంత వార్షికోత్సవం




**ప్రకృతి ఆధారిత పంటలు ఆరోగ్యానికి మేలు: జలగం కుమారస్వామి**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 03 :**ఆర్గానిక్ సంత మొదటి వార్షికోత్సవాన్ని ఈ నెల 18న ఎయూ ఏ-హబ్, మద్దిలపాలెంలో నిర్వ హించనున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ జాతీ య కార్యదర్శి జలగం కుమారస్వామి తెలిపా రు. కార్యక్రమాన్ని రైతులు, ప్రకృతి వ్యవసాయ దారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజ యవంతం చేయాలని ఆయన కోరారు. శనివా రం సిరిపురం జంక్షన్‌లోని వీఎంఆర్‌డీఏ భవనం ఐదో అంతస్తులో నిర్వహించిన 'అగ్రి మైండ్స్' మేళాలో ఆర్గానిక్ సంత వార్షికోత్సవానికి సంబంధించిన గోడపత్రికను జలగం కుమారస్వామి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రకృతి ఆధారంగా పండించిన పంట లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అన్నారు. మ న ఆరోగ్యం మనం తీసుకునే ఆహారంపై ఆధార పడి ఉంటుందని పేర్కొన్నారు.ప్రకృతి వ్యవసా యాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం మరిన్ని చర్య లు చేపట్టాలని ఆయన కోరారు. ప్రకృతి ఆధా రంగా పంటలు సాగు చేస్తు న్న రైతులకు అవస రమైన సహకారం అందించాలని పిలుపుని చ్చారు. ఆర్గానిక్ సంత వార్షికోత్సవానికి ప్రకృతి వ్యవసాయ రైతులు, వినియోగ దారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి పి. శివాజీ, గో ఆధారిత ప్రకృతి రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మ ణ్య వర్మ, కార్యదర్శి చవ్వాకుల అశోక్, సభ్యు లు శ్రీదేవి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజర్ జనార్ధన్, గేమ్ సంస్థ ప్రతినిధి సుభాష్, అగ్రి మైండ్స్ ప్రతినిధి నరేంద్ర, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

# దుప్పులవాడలో 5న పీజీఆర్ఎస్

**ప్రజా సమస్యలపై వినతులు స్వీకరణ**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 3:**గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడలో ఈ నెల 5న మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.హెచ్.వి. రమణబాబు శనివారం తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలపై కూడా ప్రజలు వినతులు సమర్పించవచ్చని తెలిపారు.మండలంలోని ప్రజలు పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమణబాబు సూచించారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాత్రుడికి ఘన సన్మానం



**ఆనందపురం, పెన్ పవర్ అక్టోబర్ 03,**న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన మరుపిల్ల చిన్నయ్య పాత్రుడును ఆనందపురం మండలం పెద్దిపాలెంలో శనివారం ఘనంగా సన్మానించారు. గ్రామ పెద్దలు గ్రామస్థుల ఆధ్వర్యంలో,ఆనందపురం భాజపా యువ నాయకుడు పోతన జీవన్ సంతోష్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు మాట్లాడుతూ.. చిన్నయ్య పాత్రుడు గ్రామస్థులతో సత్సంబంధాలు కలిగిన ఆత్మీయ వ్యక్తి అని పేర్కొన్నారు. గతంలో పెద్దిపాలెం సర్పంచిగా, ఎంపీటీసీగా పనిచేసిన ఆయన గ్రామాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై గ్రామానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు.

అనంతరం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామంలోని పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా గ్రామస్థులు హాజరయ్యారు.

ప్రముఖ విద్యావేత్త భావిశెట్టి రాజు, కూరాకుల వెంకటేష్, గుండు నానాజీ, కూరాకుల మురళీ, తమ్మన రాము, కొండబాబు, చిట్టిబాబు, చిన్న వెంకటేష్, చిన్న రామారావు, చిన్న సత్యనారాయణ, ఎలమంచిలి మురళీ, ఇల్లిపిల్లి చిన్న, ఉప్పాడ శివ, నిమ్మకాయల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆనందపురంలో రోడ్డు ప్రమాదాల స్థలాల పరిశీలన.



**ఆనందపురం, పెన్ పవర్ అక్టోబర్ 03,**ఆనందపురం మండల పరిధిలోని జాతీయ రహదారిపై గత మూడు నెలలుగా ప్రమాదాలు జరుగుతున్న స్థలాలను మంగళవారం ఉత్తర విభాగం ట్రాఫిక్ సీఐ సీహెచ్ ఉమాకాంత్,ఎస్ఐ పి.పాపారావు,రవాణా, జాతీయ రహదారుల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అనధికారికంగా బారికేడ్లను తొలగించి రోడ్డు దాటడం, మితిమీరిన వేగమే ప్రమాదాలకు ప్రధాన కారణాలని అధికారులు గుర్తించారు.ఈసందర్భంగా తొలగించిన బారికేడ్లను వెంటనే పునరుద్ధరించాలని, వేగ నియంత్రణ,హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు.ఆనందపురం నుండి పెందుర్తి వరకు సర్వీస్ రోడ్డులోని స్పీడ్ బ్రేకర్లకు రేడియం పెయింటింగ్ వేయాలని సూచించారు.

# మీ భూమి మీ హక్కు పట్టాల పంపిణీ

**రైతులకు భూమిపై హక్కును కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.**

**మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కొంతేరి జగన్రాయ్.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 03.** మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ, వనుగుపుట్ గ్రామము, జోలపుట్టు పంచాయతీ మొంజాపుట్టు గ్రామాలలో ప్రభుత్వం రైతులకు అందిస్తున్న 'మీ భూమి--మీ హక్కు' పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కొంతేరి జగన్రాయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ.. రైతులకు భూమిపై హక్కులను మరింత స్పష్టంగా కల్పించడంతో పాటు, భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగానే ఈ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు పట్టాలను ప్రభుత్వం అందజేసిందని, పట్టాలు పొందిన రైతులు వాటిని భద్రపరచుకోవాలని సూచించారు. పట్టాలు అందుకున్న రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ఆర్. శ్రావణ్ కుమార్, కూటమి నాయకులు సతీష్,



లక్ష్మణ్, రఘునాథ్, చిన్ని, బలరాం, తిరుపతి, మోహన్, రెవిన్యూ అధికారులు భూపతి, ఈశ్వర్, రమేష్, గ్రామ పెద్దలు రామచందర్, త్రినాథ్, కామేష్, సుభాష్ చంద్ర, నాగేష్ , రామకృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు బజార్లలో సబ్సిడీ ఉల్లి కౌంటర్లు ప్రారంభం

- కిలో రూ.35కే నాణ్యమైన ఉల్లిపాయలు
- ప్రజలపై ధరల భారాన్ని తగ్గించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 3 :** నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. గోపాలపట్నం, మర్రిపాలెం రైతు బజార్లలో ప్రభుత్వం ఎన్‌సీసీఎఫ్ సహకారంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సబ్సిడీ ఉల్లి విక్రయ కౌంటర్లను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పంటలకు నష్టం వాటిల్లడం, కర్నూలు తదితర ప్రాంతాల్లో ఉల్లి పంట దెబ్బతినడంతో మార్కెట్‌లో కొరత ఏర్పడి ధరలు పెరిగాయని తెలిపారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి ధర సుమారు రూ.65 నుంచి రూ.70 వరకు, రైతు బజార్లలోని సాధారణ స్టాళ్లలో సుమారు రూ.55 వరకు ఉందన్నారు. ప్రజలపై ధరల భారం పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయలను దిగుమతి చేసి సబ్సిడీ భారం భరిస్తూ కిలో రూ.35కే నాణ్యమైన ఉల్లిని అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. ఆధార్ కార్డు ప్రాతిపదికన ప్రజా యాప్ ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు 2 కిలోల చొప్పున పారదర్శకంగా ఉల్లి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా 'ఆదాయాలు పెరగాలి -- ఖర్చులు తగ్గాలి' అనే విధానంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని గణబాబు పేర్కొన్నారు. ప్రజల జీవన వ్యయాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, ఉపశమన చర్యలు చేపడుతోందన్నారు. విద్యుత్ చార్జీలు, ఇతర ఖర్చుల విషయంలో ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం, వివిధ వర్గాలకు సామాజిక పెన్షన్ల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విశాఖ నగర పరిధిలో భూగర్భ జలాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగాయని గణబాబు తెలిపారు. దీంతో రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో వర్షాలు, పంట నష్టాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు. సబ్సిడీ ఉల్లి విక్రయ కౌంటర్లను ప్రారంభించిన అనంతరం గణబాబు రైతు బజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు, వ్యాపారులతో స్వయంగా మాట్లాడారు. కూరగాయల ధరల పరిస్థితి, మార్కెట్‌లో ఎదురవుతున్న సమస్యలు, వినియోగదారుల స్పందన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు, వ్యాపారుల సాధకబాధకాలను తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి అపర్ణ ప్రసాద్, వైస్ చైర్మన్ వెంకుమహంతి చంద్రశేఖర్, రైతు బజార్ స్టేట్ అధికారి ప్రసాద్, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యాపారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పద్మనాభ నగర్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం



**రూ.10 లక్షల జీవీఎంసీ నిధులతో ఆధునిక వ్యాయామ ఏర్పాటు**

**ప్రజల ఆరోగ్యం, శారీరక దృఢత్వానికి ప్రాధాన్యం**

**ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 3 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 92వ వార్డు పద్మనాభ నగర్‌లో ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన నూతన బహిరంగ వ్యాయామశాల (ఓపెన్ జిమ్)ను ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. జీవీఎంసీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో ఆధునిక వ్యాయామ పరికరాలతో ఈ ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రారంభోత్సవం అనంతరం ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన వివిధ వ్యాయామ పరికరాలను ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల దైనందిన జీవితంలో ఆరోగ్యం అత్యంత కీలకమని అన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ప్రతి వార్డులో అవసరాన్ని బట్టి ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పద్మనాభ నగర్ కాలనీ ప్రజలు, ముఖ్యంగా యువత, మహిళలు, వయోవృద్ధులు ఈ ఓపెన్ జిమ్‌ను ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో సద్వినియోగం చేసుకోవాలని గణబాబు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూనే నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి, పార్కుల అభివృద్ధి, వ్యాయామశాలల ఏర్పాటు తదితర పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నట్లు వెల్లడించారు. ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవం సందర్భంగా గణబాబు స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో అవసరమైన మౌలిక వసతులు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలను దశలవారీగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి, స్థానిక నాయకుడు నందవరపు సోములు, 92వ వార్డు ఇన్‌చార్జి దాడి రమేష్, వార్డు అధ్యక్షుడు కంపర ఆనంద్, జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారతే కూటమి ప్రభుత్వ ధ్యేయం



- స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నాం
- న్యాయపరమైన అడ్డంకులు అధిగమించి సుప్రీంకోర్టులో పోరాడుతాం
- ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు
- రెండేళ్లలో బీసీ సంక్షేమానికి రూ.32,534 కోట్ల వ్యయం

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 3 :** బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారతే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. గోపాలపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో బీసీల జనాభా 50.42 శాతం, అంటే సుమారు 2.66 కోట్లుగా ఉందని గణబాబు పేర్కొన్నారు. సమాజంలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33? శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం అమలులో ఉన్న రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగుతాయని, బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కూడా కొనసాగుతోందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే కొందరు రాజకీయ దురుద్దేశంతో విమర్శలు చేస్తున్నారని గణబాబు ఆరోపించారు. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఏర్పడిన న్యాయపరమైన పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం అన్ని అవకాశాలను పరిశీలిస్తోందన్నారు. "ఎన్ని న్యాయపరమైన అడ్డంకులు ఎదురైనా అధిగమిస్తాం. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి బలమైన వాదనలు వినిపించి బీసీలకు న్యాయం జరిగేలా చూస్తాం" అని గణబాబు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారతకు ప్రాధాన్యత ఇస్తోందని గణబాబు తెలిపారు. స్వర్గీయ ఎన్టీఆర్ బీసీలను రాజకీయంగా ఏకతాటిపైకి తీసుకువచ్చి చట్టసభల్లో వారికి ప్రాతినిధ్యం కల్పించారని చెప్పారు. 1995లో నారా చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడంతో 16,800 మంది బీసీలు స్థానిక సంస్థల పదవులకు దూరమయ్యారని గణబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో బీసీల సంక్షేమం కోసం వివిధ పథకాల ద్వారా రూ.32,534 కోట్లు ఖర్చు చేసినట్లు గణబాబు తెలిపారు. బీసీల వృత్తులు, జీవనోపాధికి ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు, గీత కార్మికులకు 10 శాతం ఎక్సైజ్ షాపులు కేటాయించినట్లు తెలిపారు. చేనేత కార్మికులకు 'నేతన్న సేవలో' పథకం కింద కుటుంబానికి ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం, చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల భృతి, సబ్సిడీ బోట్లు, డీజిల్ వంటి సహాయాన్ని అందిస్తున్నామని చెప్పారు. మత్స్యకార సొసైటీల హక్కులకు ఇబ్బంది కలిగించేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 217ను రద్దు చేసినట్లు తెలిపారు. నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గణబాబు చెప్పారు. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణుల భృతిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచినట్లు తెలిపారు. స్వర్ణకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా బీసీల నాయకత్వాన్ని గ్రామస్థాయి నుంచి అసెంబ్లీ, రాజ్యసభ, స్పీకర్ వంటి ఉన్నత పదవుల వరకు తీసుకువచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకి ఉందని గణబాబు పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ బీసీలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం బీసీలకు కల్పిస్తున్న సంక్షేమ, ఆర్థిక, రాజకీయ అవకాశాలను సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి సాధించాలని బీసీ సోదరులకు గణబాబు పిలుపునిచ్చారు.

## కూటమి నియోజక వర్గం సమన్వయ సమావేశానికి యువ నేత

- ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ కు మర్యాద పూర్వకంగా కలిసిన వెంకట సురేష్ కుమార్





**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 03:** అల్లూరి జిల్లా కేంద్రం లో గల ఎస్ ఆర్ శంకరన్ ఆడిటోరియంలో శనివారం పాడేరు నియోజక వర్గం కూటమి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమన్వయ సమావేశనికి తెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ తో పాటు యూనిట్ ఇంచార్జీ తామర మూర్తి బాబు, బీజేపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి లకే స్వాతీ తెదేపా సీనియర్ నేతలు జగందొర చంటిబాబు, తదితరులు పాల్గొన్నారు.. అనంతరం సమన్వయ సమావేశనికి ముఖ్య అతిథిగా హాజరైన అల్లూరి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ కు మర్యాద పూర్వకంగా కలిసిన స్థానిక సమస్యలు, ఎన్నికలకు ఎలా ముందుకు వెళ్లాలనేదనిపై అడిగి తెలుసుకోన్నారు. తగు సూచనలు చేయడంతో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మీడియాకు యువ నేత కోడా వెంకట సురేష్ కుమార్ తెలిపారు.

## వి ఓ ఎ పద్మ కుమారి కి అవార్డు ప్రదానం




**ఆనందపురం, పెన్ పవర్ అక్టోబర్ 03,** ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహన కల్పించినందుకు గాను ఇదే మండలం సొంత్యాం గ్రామానికి చెందిన వి ఓ ఎ , సి హెచ్ .పద్మ కుమారి విశాఖ జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా అక్టోబర్ 2 న మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా (శుక్ర వారం )అవార్డు అందుకున్నారు
ప్రకృతి వ్యవసాయం పై ప్రోత్సహించే దిశగా రైతులకు ఆసక్తి కల్పించడం,
వాటి ఉత్పత్తుల ను స్టా ల్స్ ద్వారా రైతులకు పరిచయం చేయడం, కొనుగోలు చేయడం, రైతులు పండించిన పంటల ను నేరుగా వినియోగ దారులకు అందించడం, మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ఆమె చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఇందుకు గాను మండలంలోని వెలుగు విభాగం అధికారులు, సిబ్బంది, తోటి వి ఓ ఎ లు ఆమెను అభినందించారు

## జనసేన ఆదేశిస్తే 16వ వార్డులో పోటీకి సిద్ధం - డా. కొవగాపు పావని

ఆరిలోవ శివాజీ నగర్-2లో ప్రజలతో మమేకమై పరిచయ కార్యక్రమం



**ఆరిలోవ, పెన్ పవర్ అక్టోబర్ 3:** జనసేన పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉన్నానని, పార్టీ అధిష్టానం ఆదేశిస్తే 16వ వార్డు నుండి కార్పొరేటర్ గా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని డాక్టర్ కొవగాపు పావని తెలిపారు. శుక్రవారం ఆరిలోవ శివాజీ నగర్-2 ప్రాంతంలో స్థానిక ప్రజలతో కలిసి ఆమె పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన తండ్రి కొవగాపు సుధాకర్, స్ఫూర్తితో ప్రజా సేవలోకి వస్తున్నానని,తన తల్లి సుశీల ను వార్డు నుండి కార్పొరేటర్ గా గెలిపించి కార్పొరేషన్ లో ప్రజల తరఫున తన గొంతుక వినిపించిందని,కూటమిలో భాగంగా 16వ వార్డు టికెట్ జనసేనకు కేటాయిస్తే, పార్టీ ఆదేశాల మేరకు తాను బరిలో ఉన్నానని తెలియజేసేందుకే ప్రజల వద్దకు వచ్చానని పేర్కొన్నారు. తనకు తానుగా పరిచయం చేసుకుంటూ,వార్డు సమస్యలు తెలుసుకుంటున్నానని, అవకాశం ఇస్తే వార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తుది నిర్ణయం అధిష్టానిదేనని అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి ఉన్నానని ఆమె తెలిపారు.

## కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన పుష్పశ్రీవాణి.



**గరుగుబిల్లి అక్టోబర్ 03 పెన్ పవర్.** గరుగుబిల్లి మండలంలో చిన్న గొడబ,పిట్టల మెట్ట,తోటపల్లి ,గ్రామాల్లో ఇటీవల మరణించిన కార్యకర్తల కుటుంబాలను శనివారం నాడు మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఏ కష్టం వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని పార్టీ అండగా ఉంటుందని, పుష్ప శ్రీవాణి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణులకు ఎంబీసీ వర్గీకరణ, 50 ఏళ్లకే పెన్షన్ కల్పించాలి

**మంద కృష్ణ మాదిగకు విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం వినతి**



**విశాఖపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 3 :** నాయి బ్రాహ్మణుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం (రిజి. నెం. 500/82) ఆధ్వర్యంలో సంఘం ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు ఉద్యమ నాయకుడు మంద కృష్ణ మాదిగను కలిసి వినతి పత్రం అందజేశారు. నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నరవ పైడిరాజు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు ప్రస్తుతం బీసీ-ఏ కేటగిరీలో సీరియల్ నంబర్ 16లో ఉన్నారని తెలిపారు. బీసీ-ఏ కేటగిరీలో అనేక కులాలు ఉండటంతో తమ సామాజిక వర్గానికి తగిన స్థాయిలో రిజర్వేషన్ ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమను ఎంబీసీ (అత్యంత వెనుకబడిన తరగతులు) వర్గీకరణలోకి తీసుకురావడానికి కృషి చేయాలని మంద కృష్ణ మాదిగను కోరారు. ఎంబీసీ వర్గీకరణ ద్వారా నాయి బ్రాహ్మణులకు కులపరంగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన అవకాశాలు, రిజర్వేషన్ ఫలాలు అందే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. తమ సామాజిక వర్గం అభ్యున్నతికి ఉద్యమ నాయకుడిగా మంద కృష్ణ మాదిగ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నాయి బ్రాహ్మణుల ప్రధాన సమస్యల్లో ఒకటైన 50 సంవత్సరాలకే పెన్షన్ అంశాన్ని కూడా మంద కృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోలో నాయి బ్రాహ్మణులతో పాటు చేతివృత్తిదారులకు 50 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం కొన్ని కులాలకు మాత్రమే 50 సంవత్సరాలకే పెన్షన్ అందుతున్న పరిస్థితి ఉందని, కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న పేద నాయి బ్రాహ్మణ కుటుంబాలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాల్సిన అవసరం ఉందని పైడిరాజు పేర్కొన్నారు. రోజువారీ కులవృత్తి ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న నాయి బ్రాహ్మణులు వయసు పెరిగే కొద్దీ ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల 50 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్ అందిస్తే వృద్ధాప్య దశకు చేరుకునే ముందే వారికి ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు. నాయి బ్రాహ్మణుల ఎంబీసీ వర్గీకరణ, 50 సంవత్సరాలకే పెన్షన్ వంటి ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని మంద కృష్ణ మాదిగను కోరుతూ వినతి పత్రం సమర్పించారు. నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అదనపు కోశాధికారి మల్లువలస వర్మ, ఎంఆర్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సేవా స్ఫూర్తితో ఉచిత కంటి వైద్య శిబిరం

- ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు..
- ప్రజాక్షేత్రంలో 25 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా సేవా కార్యక్రమం
- గంకల రాజు ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు, నాయకులు, కార్యకర్తలు






**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 3 :** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని, ప్రజాక్షేత్రంలో ఆయన 25 సంవత్సరాల ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ భారతీయ జనతా పార్టీ నాయకులు గంకల రాజు ఆధ్వర్యంలో పెందుర్తిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు వైద్య నిపుణులు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు సమస్యలు, ఇతర కంటి సంబంధిత ఇబ్బందులను గుర్తించి అవసరమైన వైద్య సలహాలను అందించారు. అవసరమైన వారికి తదుపరి వైద్య పరీక్షలు, చికిత్సకు సంబంధించిన సూచనలు చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం ద్వారా సేవా కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు గంకల రాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలు, సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో కూటమి నాయకులతో సమన్వయంతో పనిచేస్తూ భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని గంకల రాజు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీడీపీ యువ నాయకులు గండి వంశీ, గొంప సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు సుధాకర్ రాజు, బీజేపీ జీవీఎంసీ 95వ వార్డు మాజీ కార్పొరేటర్ ముమ్మన దేముడు, బీజేపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొర్లె రామునాయుడు, పెందుర్తి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆవగడ్డ అప్పలనాయుడు, బీజేపీ నాయకులు శ్రీకాంత్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే వైద్య సేవలు అందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇటువంటి ఆరోగ్య, సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

# పీఎం జన్మన్ గృహాలు అర్ధాంతరం.. బిల్లులు నత్తనడక

**సీపీఎం మండల కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబు**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 3:** ప్రధానమంత్రి జన్మన్ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని సీపీఎం గూడెంకొత్తవీధి మండల కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబు ఆరోపించారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు. మండలంలోని పీఎం జన్మన్ పథకం లబ్ధిదారులు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారని, అయితే నిర్మాణానికి సంబంధించిన బిల్లులు సకాలంలో అందకపోవడంతో అనేక ఇళ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని ఆయన పేర్కొన్నారు. దీంతో పలువురు లబ్ధిదారులు చేసేదేమీ లేక తాత్కాలిక గుడిసెల్లో నివసిస్తూ ఎండ, వానలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక గృహ నిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నప్పటికీ, బిల్లులు మంజూరు కాకపోవడం ఆందోళనకరమని బుజ్జిబాబు అన్నారు. బిల్లుల కోసం లబ్ధిదారులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పీఎం జన్మన్ పథకం కింద పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని బుజ్జిబాబు డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని గృహ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆపరేషన్ త్రిశూల్‌పై వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న. సిఐ లక్ష్మణరావు ఎస్సై సాయిరాం పడాల్



**అక్టోబర్ 03 పెన్ పవర్.** జి.మాడుగుల: ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా జి.మాడుగుల మండలంలో జీపు, ఆటో డ్రైవర్లకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి భద్రతా నియమాల పాటింపు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణ, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. వాహన చోదకులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల భద్రతకు సహకరించాలని సూచించారు. అనంతరం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆపరేషన్ త్రిశూల్ పోస్టర్లను ఆటోలకు అతికించారు. కార్యక్రమంలో జి.మాడుగుల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పాల్గొన్నారు.

# జీవీఎంసీ వార్డుల పునర్విభజనపై అభ్యంతరాలు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 03 :** జీవీఎంసీ పరిధిలో చేపడుతున్న వార్డుల డీలి మిటేషన్, ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల ప్రక్రియపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాలపై నిబంధనల ప్రకారం పారద ర్శకంగా వ్యవహరించాలని కోరుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయ కులు జీవీఎంసీ అదనపు కమిషనర్‌కు వినతిప త్రం సమర్పించారు. నియోజకవర్గ సమన్వయ కర్తలు, పరిశీలకులు, మాజీ కార్పొరేటర్లు, వార్డు పార్టీ అధ్యక్షులతో కలిసి జీవీఎంసీ పరిధిలోని 120 వార్డుల ఓటర్ల జాబితాలోని అభ్యంతరా లు, కులాల వారీగా ఓటర్ల వివరాలు, వార్డుల రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలను అధికా రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ.. వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియపై ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయని తెలిపారు. కొన్ని వార్డు ల మధ్య ఓటర్ల సంఖ్యలో గణనీయమైన వ్యత్యాసం కనిపిస్తోందని పేర్కొన్నారు. 105వ వార్డులో సుమారు 8,884 మంది ఓటర్లు ఉండ గా, మరికొన్ని వార్డుల్లో 20 వేలకుపైగా ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ వ్యత్యాసాలకు గల కారణాలను అధికారులు ప్రజలకు స్పష్టంగా వివరించాలని కోరారు. ఓటర్ల జాబితా తయా రీలో తప్పులు, అవకతవకలపై తమకు ఫిర్యా దులు అందుతున్నాయని రాజు తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించి, తప్పులను సరిచేసిన అనంతరం తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని కోరారు. రిజర్వేషన్ల ప్రక్రియలో కులాల వారీగా జనాభా వివరాలు, అధికారిక రికార్డులు, చట్టపరమైన నిబంధనలను ప్రాతిపదికగా తీసుకోవాలని ఆయన సూచించారు. రిజర్వేషన్ల ఖరారులో పారదర్శకత పాటించాలని, అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిబంధనల ప్రకారం వ్యవహరించాలని కోరారు. డీలిమిటేషన్ నుంచి ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వరకు ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశ పారదర్శకం గా ఉండాల్సిన అవసరం ఉందని కె.కె. రాజు పేర్కొన్నారు. ఈ అంశాల్లో తమ అభ్యంతరాల ను ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అవసరమైతే న్యాయపరమైన మార్గాన్ని కూడా అనుసరిస్తామని తెలిపారు.

స్థానిక సంస్థలు బలోపేతం కావడం ద్వారా ప్రజ లకు పరిపాలన మరింత చేరువ అవుతుంద ని, అన్ని ప్రాంతాల అభివృద్ధికి స్థానిక సంస్థల ఎన్ని కలు అవసరమని ఆయన అన్నారు.

### పలువురు నాయకుల హాజరు

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్తలు తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, శాసన మండలి సభ్యుడు కుంభ రవిబాబు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్లు కటామురి సతీష్, జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస రావు, పార్టీ నాయకులు జహీర్ అహ్మద్, పెడాడ రమణి కుమారి, సతీష్ వర్మ, పళ్ళ దుర్గ, పి.వి. నారాయణ్, జి.వి. రవి రాజు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, వా ర్డు పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటకాభివృద్ధికి కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి మాస్టర్ ప్లాన్

- మన్యం పర్యాటకానికి సరికొత్త శోభ.కల్లటిలో నాలుగు వాటర్ ఫాల్స్ అభివృద్ధిపై కలెక్టర్ శ్రద్ధ!
- స్థానికులకు ఉపాధి, పర్యాటకులకు అదనపు సౌకర్యాలు!
- ఈ-ఆటోలు,గైడ్ శిక్షణ, హోమ్ స్టేలు
- కల్లటి జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేలా కలెక్టర్ దిశానిర్దేశం
- గిరిజన వంటకాలు, అడ్వెంచర్ పర్యాటకం కల్లటి వాటర్ ఫాల్స్ రూపురేఖలు మార్చనున్న జిల్లా యంత్రాంగం



**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 03 పెన్ పవర్.** మండలంలో కల్లటి గ్రామంలోని జలపాతాన్ని శనివారం జిల్లా కలెక్టర్ డా ఎన్.ప్రభాకర రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక గిరిజన ప్రజలు,అధికారులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్,ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం ద్వారా స్థానికులకు ఉపాధి మార్గాలు పెంపొందించవచ్చని తెలిపారు. ?పర్యాటకుల రవాణా సౌకర్యార్థం ఆసక్తి ఉన్న స్థానిక యువతకు ఎలక్ట్రిక్ ఆటోలు,బైక్‌ల కొనుగోలుకు ప్రభుత్వ పరంగారుణాలు ఇప్పిస్తామని,గుమ్మలక్ష్మీపురంలో ఒక పాయింట్ ఏర్పాటు చేసి వాహనాలను అద్దెకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే జలపాతం,గుహలు సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు మార్గదర్శకులుగా(గైడ్లుగ)వ్యవహరించేందుకు వీలుగా స్థానిక యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని,వెబ్‌సైట్ ద్వారా గైడ్ల బుకింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. అరకులో బాంబూ బిర్యానీ లాగే,కల్లటి ప్రాంతంలో లభించే కందికొత్తలు వంటి స్థానిక గిరిజన సాంప్రదాయ ఆహార పదార్థాలను పర్యాటకులకు అందించేలా మహిళలకు అవకాశం కల్పిస్తామన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా,గూగుల్ మ్యాప్స్‌లో సులభంగా కనిపించేలా జలపాతానికి ఆకర్షణీయమైన పేర్లు ఖరారు చేస్తామని తెలిపారు. ఐటీడీఏ ద్వారా వినోదం కోసం పెద్ద ఉయ్యాలలు,రాత్రి బస కోసం క్యాంపింగ్ ప్రదేశాలు,సురక్షితమైన నీటి వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఊరిలో ఇళ్లు ఉన్నవారు హోమ్ స్టే సౌకర్యం కల్పిస్తే ప్రభుత్వ లోన్లు,సబ్సిడీలు కూడా అందుతాయని స్పష్టం చేశారు. ఈ పర్యాటక ప్రదేశానికి ప్రాచుర్యం కల్పించేందుకు స్థానిక యువత యూట్యూబ్,ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా వీడియోలు,ఫోటోలు ప్రచారం చేయాలని,జిల్లా యంత్రాంగం తరపున వైజాగ్ ఎయిర్‌పోర్టు వంటి ప్రముఖ ప్రాంతాల్లో పబ్లిసిటీ బ్యానర్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు,స్థానిక రెవెన్యూ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెదగంట్యాడ 130 అడుగుల 4 లైన్ల రహదారి విస్తరణ పనులు వేగవంతం

- గాజువాక నియోజకవర్గంలో ప్రధాన ఆకర్షణంగా నిలవనున్న పెదగంట్యాడ కూడలి
- జంక్షన్ లో ఉన్న చేపల మార్కెట్ ను వేరే చోట అధునాతనంగా నిర్మించనున్నారు.
- ఎదలకు 5 రూపాయలకే భోజనం పెట్టే అన్న క్యాంటీన్ ను పెదగంట్యాడ కూడలి వద్ద నిర్మాణం:పల్లా

**గాజువాక ;పెన్ పవర్ ,అక్టోబర్ 03 :** గ్రేటర్ విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద , రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, రహదారి విస్తరణ పనులను స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు . పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణ పనులు నిర్ణీత ప్రమాణాలతో, వేగంగా పూర్తయ్యేలా, రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటి కాలుష్యం వలన ఏర్పడుతున్న ఇబ్బందులను కొద్దిగా అరికట్టాలని, ఈ రహదారి విస్తరణ పూర్తయితే, పెదగంట్యాడ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు, ప్రజల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. పారిశ్రామిక ప్రాంతాలు, నివాస ప్రాంతాలు మరియు ప్రధాన రహదారులకు మెరుగైన అనుసంధానం ఏర్పడటంతో స్థానికంగా అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ, అభివృద్ధి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సహకారం అందిస్తామని స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు పులి రమణా రెడ్డి , వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, పెద్దాడ సోమినాయుడు, వంగలపూడి అప్పలరాజు, కడవల రమణ, అప్పల స్వామి, గంట్యాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల.

- ముత్యాలమ్మపాలెం--అనకాపల్లి ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం.



**పరవాడ : పెన్ పవర్:అక్టోబర్ 03:** మండలం ముత్యాలమ్మ పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని మత్స్యకారులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసన్న ముత్యాలమ్మ పాలెం వయా లంకెలపాలెం మీదగా అనకాపల్లి ఆర్టీసీ బస్ సర్వీస్ను పునరుద్ధరిస్తానని ఎమ్మెల్యే పంచకర్ల ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ముత్యాలమ్మ పాలెం అనకాపల్లి ఆర్టీసీ నూతన సర్వీస్ బస్సును శనివారం ముఖ్యఅతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి, జెండా ఊపి ప్రారంభించారు. అనకాపల్లి నుండి ముత్యాలమ్మ పాలెం ఆర్టీసీ బస్సు సర్వీస్ లేక మత్స్యకారులు ఆయా ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు ఆయా ప్రాంతాలకు చెందిన ప్రయాణికుల అభీష్టం మేరకు ఎమ్మెల్యే ఆర్టీసీ బస్ సర్వీసును ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సర్వీసు ప్రతిరోజూ ఉదయం 7.20 గంటలకు ముత్యాలమ్మపాలెం నుంచి బయలుదేరి, పరవాడ, ఫార్మాసిటీ, లంకెలపాలెం మీదుగా అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటుందని తిరిగి సాయంత్రం 4.30 గంటలకు అనకాపల్లి నుంచి బయలుదేరి ముత్యాలమ్మపాలెం చేరుకుంటుందనీ ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు, మత్స్యకారులు, మహిళలు, విద్యార్థులతో పాటు ఫార్మాసిటీలో పనిచేసే ఉద్యోగులకు ఈ బస్సు సర్వీసు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనకాపల్లికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు కూడా రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ప్రయాణికులు ఈ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి ముందు నూతనంగా ముత్యాలమ్మ పాలెం నుండి అనకాపల్లి బస్సు సర్వీసు ఏర్పాటుపై జనసేన పార్టీ నాయకుడు అర్జిల్లి అప్పలరాజు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ముత్యాలమ్మపాలెం గ్రామానికి ఆర్టీసీ సర్వీసు అందుబాటులోకి తీసుకురావడంలో సహకరించిన ఎమ్మెల్యే క ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పరవాడ మండల ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com